# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ మంగళవారం 7-12-2021 RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :28 సంచిక: 102 పేజీలు:4 వెల: రూ.1/-


## శంషాబాద్ ఎయిర్‌పోర్టులో హై-రిస్క్ దేశాల ప్రయాణికులకు ప్రత్యేక ఏర్పాట్లు

హైదరాబాద్, డిసెంబర్ 6:ఒమిక్రాన్ వేరియంట్ వ్యాప్తి నేపథ్యంలో శంషాబాద్ ఎయిర్‌పోర్టులో 11 హై-రిస్క్ దేశాల ప్రయాణికులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కేంద్ర మార్గదర్శకాల ప్రకారం హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఇంటర్నేషనల్ అరైవల్ హాల్ ప్రీ ఇమ్మిగ్రేషన్‌లో ప్రత్యేక కొవిడ్ -19 టెస్టింగ్ బూత్‌లను అందుబాటులోకి తీసుకొచ్చారు. అన్ని అరైవల్ గేట్ల వద్ద థర్మల్ స్కానర్‌లో ఏర్పాటు చేశారు. ప్రతి ప్రయాణికుడు థర్మల్ స్క్రీనింగ్ అయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు.

ఇక ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, టెర్మనల్‌లో ఆర్టీపీసీఆర్, ర్యాపిడ్ టెస్టుల ఏర్పాట్ల గురించి పోస్టర్ల ద్వారా తెలియజేస్తున్నారు. ఈ టెస్టుల కోసం బుకింగ్ ప్రక్రియను కూడా అందుబాటులోకి తీసుకొచ్చారు. ప్రయాణికులు రాకకు ముందే తమ బుకింగ్‌ను బుక్ చేసుకోవచ్చు. తదితర వివరాల కోసం www. hyderabad.aero, http:// covid.mapmygenome.in లాగిన్ అవొచ్చు. ఆర్టీపీసీఆర్ టెస్ట్ కోసం రూ. 750, ర్యాపిడ్ పీసీఆర్ టెస్ట్ కోసం రూ. 3,900 చెల్లించాల్సి ఉంటుంది.

# తెలంగాణలో జర్మనీ కంపెనీ రూ. 1500 కోట్ల పెట్టుబడి



హైదరాబాద్, డిసెంబర్ 6:తెలంగాణకు అంతర్జాతీయ పెట్టుబడుల ప్రవాహం కొనసాగుతూనే ఉంది. జర్మనీకి చెందిన Liteauto GmbH అనే కంపెనీ తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చింది. జర్మనీ అంబాసిడర్ వాల్టర్ జే లిండర్, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ సమక్షంలో Liteauto Gmb కంపెనీ ఒప్పందం కుదుర్చుకు న్నది. ఈ కంపెనీ రూ. 1500 కోట్ల పెట్టుబడులు పెట్టనుంది. దీంతో దాదాపు 9 వేల మందికి ప్రత్యక్షంగా, 18 వేల మందికి పరోక్షంగా ఉపాధి లభించనుంది. ఈ కంపెనీ కార్లు, కామర్షియల్ వాహనాలు, ద్విచక్ర వాహనాలకు సంబంధించిన మెగ్నీషియం భాగాలను ఉత్పత్తి చేయనుంది. హైదరాబాద్‌లోని తాజ్‌కృష్ణ హోటల్‌లో జరిగిన జర్మనీ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. జర్మనీ పెట్టుబడులకు తెలంగాణ ప్రభుత్వం ఆహ్వానం పలుకుతుందన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు 2 వేల ఎకరాల స్థలం అందు బాటులో ఉందని తెలిపారు. పరిశ్రమల ఏర్పాటుకు కావాల్సిన మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు జర్మనీ రూపొందించిన విధివిధానాలు బాగున్నాయని పేర్కొన్నారు. జర్మనీ ప్రభుత్వం, అక్కడి పారిశ్రామికవేత్తలతో కలిసి పని చేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. చిన్న తరహా పరిశ్రమలే జర్మనీ జీడీపీ వృద్ధికి సహకరిస్తున్నాయని కేటీఆర్ స్పష్టం చేశారు. రాష్ట్రంలో డిఫెన్స్ ల్యాబ్‌లు, ఏరోస్పేస్ పరిశ్రమలు, పరిశోధనా కేంద్రాలు ఉన్నాయి. జర్మనీ పెట్టుబడిదారుడు ఎవరైనా రాష్ట్రంలో పరిశ్రమ పెట్టాలని భావిస్తే దేశంలోని మిగతా రాష్ట్రాల కంటే మెరుగైన ప్రోత్సాహకాలను అందించేందుకు కృషి చేస్తామని కేటీఆర్ చెప్పారు. ఏడున్నరేండ్లలో సీఎం కేసీఆర్ పాలనలో ఎన్నో కార్యక్రమాలు చేపట్టామని పేర్కొన్నారు. ప్రాధాన్యత క్రమంలో సమస్యలను పరిష్కరించాం. తొలి ప్రాధాన్యతగా విద్యుత్ సమస్యను పరిష్కరించాం. అన్ని రంగాలకు 24 గంటల విద్యుత్ సరఫరా అందుబాటులో ఉందని స్పష్టం చేశారు. పరిశ్రమలకు సింగిల్ విండో విధానంలో దరఖాస్తు చేసుకున్న 15 రోజుల్లోనే అనుమతులు ఇస్తున్నామని తెలిపారు. అమెరికాలో కూడా టీఎస్ ఐపాస్ లాంటి చట్టం లేదని స్పష్టం చేశారు. టీఎస్ ఐపాస్ ద్వారా 17,500 కంపెనీలకు ఇప్పటి వరకు క్లియరెన్స్ ఇచ్చామని కేటీఆర్ తెలిపారు.

## నేడు కిసాన్ సంయుక్త మోర్చా కీలక సమావేశం

న్యూఢిల్లీ, డిసెంబర్ 6: సంయుక్త కిసాన్ మోర్చా కీలక సమావేశం మంగళవారం జరుగనున్నది. ఈ సందర్భంగా ఉద్యమ భవిష్యత్‌పై రైతు సంఘాల నేతలు ఉదయం 11 గంటలకు సమావేశమై చర్చించనున్నారు. ఎంఎస్‌పీ, వ్యవసాయ చట్టాల రద్దుకు వ్యతిరేకంగా జరిగిన ఆందోళనలో మరణించిన రైతుల కుటుంబాలకు పరిహారం, నిరసనకారులపై కేసుల ఉపసంహరణ సహా పెండింగ్‌లో ఉన్న డిమాండ్లపై కేంద్ర ప్రభుత్వంతో చర్చలు జరిపేందుకు ఎస్‌కేఎం శనివారం ఐదుగురు సభ్యుల ప్యానెల్‌ను ఏర్పాటు చేసింది.

మూడు వ్యవసాయ చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన రైతులు వివిధ రైతు సంఘాల ఆధ్వర్యంలో గత ఏడాది నవంబర్ 26 నుంచి దేశ సరిహద్దుల్లో నిరసన వ్యక్తం చేస్తున్నారు. డిమాండ్లలో ప్రధానమైన మూడు వ్యవసాయ చట్టాలను రద్దు చేస్తూ కేంద్రం పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టింది. అయితే, మిగతా డిమాండ్లను సైతం నెరవేర్చాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఐదుగురు సభ్యుల కమిటీ పెండింగ్‌లో ఉన్న డిమాండ్లపై ప్రభుత్వంతో చర్చలు జరుపనున్నది. గతంలో ప్రభుత్వంతో అనధికారిక చర్చలు జరిగాయి.

అయితే, కేసుల ఉపసంహరణ, ఎంఎస్‌పీపై చట్టపరమైన హామీతో సహా సమస్యల పరిష్కారానికి రాతపూర్వక హామీ కోరుకుంటున్నట్లు ఓ రైతు నాయకుడు పేర్కొన్నారు. శనివారం ఎన్‌కేఎన్ సమావేశమైన అనంతరం రైతు నాయకులు బల్బీర్‌సింగ్ రాజేవాల్, అశోక్ ధావ్లే, శివకుమార్ కక్కా, గుర్నామ్ సింగ్, యుధ్వీర్ సింగ్‌లను కమిటీ సభ్యులుగా ఎంపిక చేశారు. గత నెల 19న ప్రధాని నరేంద్ర మోదీ జాతినుద్దేశించి చేసిన ప్రసంగంలో మూడు వ్యవసాయ చట్టాలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. ఆ తర్వాత 21న ఎంఎస్‌పీ, రైతులకు పరిహారం సహా ఆరు డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ ప్రధానికి రైతు సంఘాలు లేఖ రాసింది.

## నాగాలాండ్‌లో పరిస్థితి ఉద్రిక్తంగా ఉన్నా.. అదుపులోనే ఉంది: అమిత్ షా




న్యూఢిల్లీ, డిసెంబర్ 6:నాగాలాండ్‌లో కూలీలపై ఆర్మీ కాల్పులు జరిపిన ఘటన పట్ల ఇవాళ లోక్‌సభలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ప్రకటన చేశారు. మాన్‌లోని ఓటింగ్‌లో తీవ్రవాదుల కదలికలు ఉన్నట్లు ఆర్మీకి సమాచారం వచ్చిందని, ఆ సమయంలో అనుమానాస్పద ప్రాంతంలో సుమారు 21 మంది కమాండోలు ఆపరేషన్‌కు సిద్ధమయ్యారని, అయితే అక్కడకు వచ్చిన వాహనాన్ని ఆపేందుకు ప్రయత్నించగా.. ఆ వాహనం ఆగకుండా వెళ్లిందన్నారు.

దీంతో ఆ వాహనంలో తీవ్రవాదులను తరలిస్తున్నట్లు అనుమానించి ఆర్మీ కాల్పులు జరపాల్సి వచ్చిందని షా తెలిపారు. ఆ వాహనంలో ఉన్న 8 మందిలో 6 మంది కాల్పులకు బలైనట్లు ఆయన చెప్పారు. గాయపడ్డ ఇద్దర్ని సమీపంలో ఉన్న ఆరోగ్య కేంద్రానికి ఆర్మీ తరలించిందన్నారు. ఈ ఘటన తర్వాత గ్రామస్తులు ఆర్మీ యూనిట్‌ను చుట్టుముట్టి, రెండు వాహనాలు ధ్వంసం చేశారని, సైనికులపై తిరగబడ్డారని హోంమంత్రి చెప్పారు.

గ్రామస్థుల తిరుగుబాటులో ఓ సైనికుడు మృతిచెందినట్లు ఆయన వెల్లడించారు. ఆత్మరక్షణ కోసం సైనికులు ఫైరింగ్ జరిపారన్నారు. కాల్పుల వల్ల మరో ఏడు మంది పౌరులు మృతిచెందినట్లు షా వెల్లడించారు.

ప్రస్తుతం పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నా.. అదుపులోనే ఉందన్నారు. ఘటన జరిగిన ప్రాంతాన్ని డిసెంబర్ 5వ తేదీన నాగాలాండ్ డీజీపీ, కమిషనర్ విజిట్ చేశారన్నారు. ఆర్మీ కాల్పుల ఘటన పట్ల ఎఫ్ఐఆర్ రిజిస్టర్ చేశామన్నారు. కేసు విచారణ కోసం రాష్ట్ర పోలీసులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. నెల రోజుల్లోనే విచారణను పూర్తి చేయాలని సిట్‌ను కూడా ఏర్పాటు చేసినట్లు మంత్రి చెప్పారు. మృతుల కుటుంబాలకు ఆయన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## పారదర్శకంగా 'డబుల్' లబ్ధిదారుల ఎంపిక : మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్



బన్సీలాల్‌పేట్, డిసెంబర్ 6:: పేద ప్రజల కోసం ప్రభుత్వం ఉచితంగా నిర్మించి ఇస్తున్న డబుల్ బెడ్‌రూం ఇండ్ల లబ్ధిదారుల ఎంపికలో ఎంతో పారదర్శకంగా వ్యవహరిస్తున్నట్టు మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ వెల్లడించారు.

సోమవారం సనత్‌నగర్ నియోజకవర్గం పరిధిలోని బన్సీలాల్‌పేట్ డివిజన్ చాచానెహ్రూనగర్‌లో నిర్మించిన 264 డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను పంపిణీ చేసేందుకు అర్హులైన లబ్ధిదారులను గుర్తించేందుకు చేపట్టిన ప్రత్యేక బస్తీ సభలో మంత్రి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ?ఎలాంటి విమర్శలకు ఆస్కారం లేకుండ బస్తీ ప్రజల అందరి సమక్షంలోనే అర్హులను గుర్తించి ఇండ్లను కేటాయించడం జరుగుతున్నదని స్పష్టం చేశారు. మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, కలెక్టర్ శర్మన్‌ల సమక్షంలో అధికారులు లబ్ధిదారులను ఒక్కొక్కరిగా పేర్లతో పిలిచి ఇతను మీ బస్తీ వాసేనా అని స్థానిక ప్రజలను అడిగి అర్హుడిగా నిర్ధారణ చేశారు.

బస్తీలో నివసించే అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇండ్లు కేటాయిస్తామని మంత్రి ప్రకటించారు. లబ్ధిదారులపై ఒక్క పైసా భారం పడకుండ దేశంలో ఎక్కడ లేని విధంగా ప్రభుత్వమే ఉచితంగ ఇండ్లను నిర్మించి ఇస్తున్న ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కు దక్కుతుందని అన్నారు.

ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ హేమలత, సికింద్రాబాద్ ఆర్డీవో వసంతకుమారి, తహసీల్దార్ బాలశంకర్, హౌసింగ్ ఈఈ వెంకట్‌దాస్ రెడ్డి, టీఆర్ఎస్ నాయకులు జీ.పవన్‌కుమార్‌గౌడ్, కే.లక్ష్మీపతి, బస్తీ అధ్యక్షుడు అచ్చా నర్సింగ్‌రావు, డి.సుదర్శన్‌బాబు, వై.సురేశ్‌కుమార్, విజయ్‌శంకర్, శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎంపిక ప్రక్రియ పట్ల స్థానికుల హర్షం

అర్హులైన లబ్ధిదారుల ఎంపిక కోసం అధికారులు చేపట్టిన ఎంపిక ప్రక్రియ పట్ల బస్తీవాసులు హర్షం ప్రకటించారు. గతంలో ఎన్నడు కూడా ఇంత బాగా జరగలేదని, వారికి నచ్చిన వారికి ఇండ్లను కేటాయించుకునే వారన్నారు. ఇప్పుడు మాత్రం బస్తీవాసుల సమక్షంలో ప్రతి ఒక్కరిని వేదికపైకి పిలిచి అందరూ అంగీకారం తెలిపితేనే ఇల్లు కేటాయించడం అనే పద్ధతి చాలా బాగుందని ప్రశంసించారు. అభ్యంతరాలను, రద్దు చేసిన వారి పేర్లు, కారణాలతో సహా జాబితాలను నోటీసు బోర్డులపై పెట్టేశారు. అలాగే, ఎంపిక చేసిన అర్హులైన లబ్ధిదారుల జాబితా కూడా సర్వే అనంతరం ప్రజల సమక్షంలో ప్రదర్శించి, నోటీసు బోర్డులో పెడతామని అధికారులు తెలిపారు.

## అంబేద్కర్ ఆలోచనలు అత్యంత ఆదర్శనీయం : మంత్రి కేటీఆర్



హైదరాబాద్, డిసెంబర్ 6:భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా టీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రగతి భవన్‌లో నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడారు. స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలోనే అద్భుతమైన దీర్ఘదృష్టితో భావితరాల కోసం భారత రాజ్యాంగానికి అంబేద్కర్ రూపకల్పన చేశారు. అంబేద్కర్ ఆలోచనలు ఎల్లప్పుడూ అత్యంత ఆదర్శనీయం అని పేర్కొన్నారు. అంబేద్కర్ ఆలోచనల ఫలితంగానే తెలంగాణ ప్రజల ఆత్మగౌరవ ఆకాంక్ష అయిన ప్రత్యేక రాష్ట్రం సిద్ధించిందని కేటీఆర్ గుర్తు చేశారు. ఉద్యమ పోరాటంలోనే కాకుండా ప్రభుత్వ పాలనలోనూ అంబేద్కర్ ఆలోచనలే తమకు ప్రాతిపదిక అని కేటీఆర్ తెలిపారు. ఆయన స్ఫూర్తితో సమాజంలోని అన్ని వర్గాలను అభివృద్ధి పథంలో నడిపించేందుకు ముందుకు వెళ్తున్నామని కేటీఆర్ స్పష్టం చేశారు.

## సాయుధ దళాల చట్టాన్ని తొలగించండి: నాగాలాండ్ సీఎం

కోహిమా, డిసెంబర్ 6:: సాయుధ దళాల ప్రత్యేక అధికారాల చట్టం (అఫ్స్పా)ని తొలగించాలని నాగాలాండ్ సీఎం నేఫియు రియో డిమాండ్ చేశారు. ఈ చట్టం వల్ల దేశ ప్రతిష్ఠ మసకబారిందని విమర్శించారు. మన్ జిల్లాలో ఆర్మీ కాల్పుల్లో 14 మంది పౌరులు మరణించడంతో ఆ రాష్ట్రంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. నాగాలాండ్ సీఎం నేఫియు ఈ ఘటనను ఖండించారు. తీవ్రవాదులుగా పొరపడి పౌరులపై కాల్పులు జరిపిన ఆర్మీ యూనిట్‌పై కేసు నమోదుకు ఆదేశించారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో ఈ అంశంపై ఆయన మాట్లాడారు. అమిత్ షా ఈ విషయాన్ని చాలా సీరియస్‌గా తీసుకున్నారని చెప్పారు. సాయుధ దళాల ప్రత్యేక అధికారాల చట్టం (అఫ్స్పా)ని తొలగించాలని కేంద్రాన్ని కోరామన్నారు. బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించినట్లు వెల్లడించారు. అనంతరం మరణించిన పౌరుల అంత్యక్రియల్లో ఆయన పాల్గొని నివాళి అర్పించారు.

## జర్మనీ పారిశ్రామికవేత్తలతో కలిసి పని చేసేందుకు సిద్ధం : మంత్రి కేటీఆర్

హైదరాబాద్, డిసెంబర్ 6:హైదరాబాద్‌లోని తాజ్‌కృష్ణ హోటల్‌లో జర్మనీ ఇన్వెస్టర్స్ సమ్మిట్ జరిగింది. ఈ సదస్సులో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. జర్మనీ పెట్టుబడులకు తెలంగాణ ప్రభుత్వం ఆహ్వానం పలుకుతుందన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు 2 వేల ఎకరాల స్థలం అందుబాటులో ఉందని తెలిపారు. పరిశ్రమల ఏర్పాటుకు కావాల్సిన మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు జర్మనీ రూపొందించిన విధివిధానాలు బాగున్నాయని పేర్కొన్నారు. జర్మనీ ప్రభుత్వం, అక్కడి పారిశ్రామికవేత్తలతో కలిసి పని చేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. చిన్న తరహా పరిశ్రమలే జర్మనీ జీడీపీ వృద్ధికి సహకరిస్తున్నాయని కేటీఆర్ స్పష్టం చేశారు.

ఏడున్నరేండ్లలో సీఎం కేసీఆర్ పాలనలో ఎన్నో కార్యక్రమాలు చేపట్టామని పేర్కొన్నారు. ప్రాధాన్యత క్రమంలో సమస్యలను పరిష్కరించాం. తొలి ప్రాధాన్యతగా విద్యుత్ సమస్యను పరిష్కరించాం. అన్ని రంగాలకు 24 గంటల విద్యుత్ సరఫరా అందుబాటులో ఉందని స్పష్టం చేశారు. పరిశ్రమలకు సింగిల్ విండో విధానంలో దరఖాస్తు చేసుకున్న 15 రోజుల్లోనే అనుమతులు ఇస్తున్నామని తెలిపారు. అమెరికాలో కూడా టీఎస్ ఐపాస్ లాంటి చట్టం లేదని స్పష్టం చేశారు. టీఎస్ ఐపాస్ ద్వారా 17,500 కంపెనీలకు ఇప్పటి వరకు క్లియరెన్స్ ఇచ్చామని కేటీఆర్ తెలిపారు.

## నీటి పారుదల పనులకే నిధులు..
## పోలవరంపై కేంద్రం కీలక ప్రకటన

అమరావతి, డిసెంబర్ 6:పోలవరం ప్రాజెక్ట్‌లో ఇరిగేషన్ విభాగానికి మాత్రమే నిధులు కేటాయించబోతున్నట్లు జలశక్తి శాఖ సహాయ మంత్రి బిశ్వేశ్వర్ తుడు సోమవారం రాజ్యసభలో ప్రకటించారు. వైఎస్సార్సీపీ సభ్యుడు వి.విజయసాయి రెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి రాతపూర్వకంగా జవాబిస్తూ ఈ విషయం వెల్లడించారు. 2017-18 ధరల ప్రాతిపదికపై పోలవరం ప్రాజెక్ట్ పనులకు సంబంధించి రెండవసారి సవరించిన అంచనా వ్యయం మొత్తం 55,548 కోట్లను 2019 ఫిబ్రవరిలో జరిగిన సలహా సంఘం సమావేశం ఆమోదించినట్లు తెలిపారు. తదుపరి దీనిని పరిశీలించిన రివైజ్డ్ కాస్ట్ కమిటీ సవరించిన అంచనా వ్యయంలో కేవలం ఇరిగేషన్ విభాగానికి అయ్యే ఖర్చు మొత్తం 35,950 కోట్లకు మాత్రమే ఆమోదం తెలుపుతూ మార్చి 2020న నివేదికను సమర్పించింది. దీనిపై పోలవరం ప్రాజెక్ట్ అథారిటీ (పీపీఏ) తుది సిఫార్సుల అనంతరం ఇన్వెస్ట్‌మెంట్ క్లియరెన్స్ తీసుకోవడం జరుగుతుందని మంత్రి తెలిపారు.

2014 ఏప్రిల్ 1 నుంచి పోలవరం ప్రాజెక్ట్‌లో ఇరిగేషన్ విభాగం పనులకు అయ్యే వ్యయాన్ని నూరు నూరు శాతం భరించడానికి భారత ప్రభుత్వం ఆమోదం తెలిపింది. తదనుగుణంగా పోలవరం పనుల నిర్వహణ కోసం రాష్ట్ర ప్రభుత్వం చేసే ఖర్చుకు సంబంధించిన బిల్లులను పీపీఏ, సెంట్రల్ వాటర్ కమిషన్ (సీడబ్ల్యూసీ) పరిశీలించి, సిఫార్సు చేసిన మేరకు ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆమోదం అనంతరం రాష్ట్ర ప్రభుత్వానికి రీయంబర్స్ చేస్తున్నట్లు చెప్పారు. 2014 నుంచి ఇప్పటి వరకు కేంద్ర ప్రభుత్వం పోలవరం ప్రాజెక్ట్ పనులకు సంబంధించి 11,600 కోట్ల రూపాయలను రీయంబర్స్ చేసింది. అదనంగా మరో 711 కోట్ల రూపాయల రీయంబర్స్‌మెంట్ కోరుతూ ఇటీవలే పీపీఏ, సీడబ్ల్యూసీ సిఫార్సు చేసినట్లు మంత్రి చెప్పారు.

జలశక్తి అభియాన్: కాచ్ ద రైన్ క్యాంపెయిన్ కింద ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటి వరకు 7 లక్షల 97,502 పనులు నిర్వహించినట్లు మంత్రి తెలిపారు. జలశక్తి అభియాన్ ప్రారంభించిన ఈ క్యాంపెయిన్ కింద జల సంరక్షణ, వర్షపు నీటి సంరక్షణ, సాంప్రదాయ నీటి వనరులు, చెరువుల పునరుద్ధరణ, బోరు బావుల పునరుద్ధరణ, వాటర్‌షెడ్ డెవలప్‌మెంట్, అడవుల పెంపకం, శిక్షణా కార్యక్రమాలు,

## కాంగ్రెస్ పార్టీకి షాక్..పీసీసీ ప్రధాన కార్యదర్శి చల్మెడ రాజీనామా

కరీంనగర్ డిసెంబర్ 6 (నేటినిజం ప్రతినిధి): కాంగ్రెస్ పార్టీకి మరో షాక్ తగిలింది. పీసీసీ ప్రధాన కార్యదర్శి చల్మెడ లక్ష్మీనర్సింహారావు ఆ పార్టీకి రాజీనామా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కాంగ్రెస్ పార్టీ తనకు రెండుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చిందన్నారు. కాంగ్రెస్ అంతర్గత కుమ్ములాటతోనే తనను ఓడించినట్లు ఆరోపించారు.

కాంగ్రెస్ పార్టీ గెలవడం కన్నా టీఆర్ఎస్‌ను ఓడించమే లక్ష్యంగా పని చేస్తుందన్నారు. హుజురాబాద్ ఉప ఎన్నికల్లో లోపాయికారి ఒప్పందంతో ఇతర పార్టీలకు మద్దతు ఇచ్చిందని ఆయన ఆరోపించారు. జాతీయ పార్టీ అయిన కాంగ్రెస్‌కు ఉప ఎన్నికల్లో 3వేల ఓట్లు రావడం కాంగ్రెస్ పార్టీ నాయకుల పనితీరుకు నిదర్శనమన్నారు.కాంగ్రెస్ పార్టీ చివరి నిమిషం వరకు అభ్యర్థిని ప్రకటించక బయటి వ్యక్తిని తీసుకువచ్చి కాంగ్రెస్ ఓటమికి కారణమయ్యారన్నారు. కొత్త పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ భవనంలో కుమ్ములాటలు జరుగుతున్నాయన్నామని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ దేశంలో ప్రతిపక్ష పాత్ర పోషించలేక విఫలం చెందిందన్నారు.ఆ పార్టీకి భవిష్యత్ లేదని నిర్ణయించుకున్నాక, తన అనుచరులతో కలిసి టీఆర్ఎస్‌లో చేరుతున్నట్లు తెలిపారు. సీఎం కేసీఆర్ రాష్ట్రానికి చేస్తున్న అభివృద్ధిలో తాను భాగస్వామ్యం కావాలని భావిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 8వ తేదిన తెలంగాణ భవన్‌లో అనుచరులతో కలిసి తాను టీఆర్ఎస్ భవన్‌లో పార్టీ కండువా కప్పుకుంటున్నట్లు ప్రకటించారు.

### చరిత్రలో నేటినిజం



కం॥ ఘనమైన భావుకతతో
ఘనతరముగ నేర్పుతోడ కామనతోడున్
సినిమాపై మక్కువతో
ఘనరాసె సురేంద్రరెడ్డి దర్శకుడుగుచున్!!

(డిసెంబర్ 7 సినిమా దర్శకుడు సురేంద్రరెడ్డి జననం...)



-రాధశ్రీ
సెల్: 9494481210




# సాయుధ దళాల త్యాగాలు మరువలేనివి

**(07 డిసెంబర్ 'సాయుధ దళాల పతాక దినోత్సవం' సందర్భంగా)**

భారత త్రివిధ దళాల్లో ఆర్మీ, నావికా, వైమానిక ధళం అనబడే అత్యంత ఆధునిక మూడు విభాగాలు దేశ సరిహద్దుల రక్షణలోనే కాకుండా దేశ అంతర్గత అశాంతిని రూపుమాపటంలో కూడా తమ అమూల్య సేవలను, త్యాగాలను పరిచయం చేస్తూనే ఉన్నాయి. ఆర్మీ సైనికులు (సోల్జర్స్), నావీలోని నావికులు (సెయిలర్స్), వైమానికదళంలోని ఏయిర్‌మెన్‌ల త్యాగాల పునాదుల మీద దేశ భద్రత ఆధారపడి ఉంటున్నది. అంకిత భావం, క్రమశిక్షణ, దేశభక్తి, నిబద్ధత, విధి నిర్వహణ లాంటి విశిష్ట లక్షణాలు కలిగిన త్రివిధ సాయుధ దళాల సంక్షేమానికి ఉద్దేశించిన విరాళాలను దేశ పౌరుల నుంచి సేకరించడానికి ప్రతి ఏట 07 డిసెంబర్‌న 'సాయుధ దళాల పతాక దినోత్సవం' పెద్ద ఎత్తున నిర్వహించబడుతున్నది. సాయుధదళాల సేవలను ప్రస్తుతిస్తూ, వారికే కాకుండా వారి కుటుంబాల సంక్షేమానికి ఉదార విరాళాలు అందించే అద్భుత అవకాశం దేశ సామాన్య జనానికి ఇవ్వడం జరుగుతున్నది. 07 డిసెంబర్ 1949 నుంచి పాటుస్తున్న సాయుధ దళాల పతాక దినం వేదికగా దేశవ్యాప్తంగా విస్తరించిన పట్టణాలు, మేజర్ గ్రామపంచాయితీల్లోని విద్యార్థినీ విద్యార్థులు చిన్న చిన్న పతాకాలు, స్టాంపులను సాధారణ పౌరులకు పంచుతూ విరాళాలు స్వీకరిస్తారు. దేశ రక్షణలో ప్రాణాలర్పించిన అమర జవాన్ల కుటుంబాలకు, గాయపడిన సైనికులకు, అమర జవాన్ల పిల్లల భవితకు, భర్తలను కోల్పోయిన వీర నారీమణులకు, మాజీ సైనికుల సంక్షేమాలకు వినియోగపడే నిధికి సహకరించడానికి పతాక దినం సందర్భాన్ని వాడుకుంటారు. దేశ సేవ అనే పవిత్ర కార్యంలో ప్రాణాలర్పించిన త్రివిధ దళాల జవాన్ల అకుంఠిత దేశభక్తిని మది నిండా నింపుకొని పెద్ద ఎత్తున విరాళాలను ఇవ్వాల్సిన కనీస బాధ్యత అందరి మీద ఉన్నది.

దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వ కేంద్రీయ సైనిక్ బోర్డులు, 32 రాజ్య సైనిక బోర్డులు, 392 జిల్లా సైనిక బోర్డుల సహకారంతో దేశ నలుమూలల విరాళాలను సేకరిస్తారు. భరతమాత రక్షణలో అంతిమ త్యాగం చేయడానికి కూడా సంకోచించని వీర జవాన్ల సంక్షేమానికి ఉదారంగా విరాళాలను స్వచ్ఛందంగా అందించడమే కాకుండా సైనికుల నుంచి ప్రేరణ పొంది త్రివిధ దళాల్లో చేరడం, సైనికుల వీరత్వాన్ని ఆదర్శంగా తీసుకోవడం, వారికి సదా రుణపడి ఉండడం మన కనీస బాధ్యత అని ఎన్నటికీ మరువరాదు. దేశ రక్షణలో ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలకు హృదయపూర్వకంగా చేయూతనిస్తూ, వారి కుటుంబ సభ్యులకు మేమున్నామనే భావనను కలిగించుట మన కనీస కర్తవ్యం. పతాక దినోత్సవ వేడుకల్లో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు, నాటకాలు, ఉత్సవాలు, వినోద కార్యక్రమాలు, ప్రదర్శనలు లాంటి ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తారు. సాయుధ దళాల పతాక దినం రోజున స్టిక్కర్లు, ఒటివి స్వీకరిస్తూ విరాళాలను అందజేద్దాం. వీర జవాన్ల ధైర్యసాహసాలు, పోరాట పటిమ, శత్రువులను మట్టుపెట్టే తెగువలను గుర్తు చేసుకుంటూ పెద్ద మొత్తంలో విరాళాలు అందిద్దాం. దేశభక్తిగల పౌరులమని సగర్వంగా నిరూపించుకుందాం.

జై జవాన్ అంటూ దిక్కులు పిక్కటిల్లేలా నినదిద్దాం.



– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

## తయారీకి రంగానికి ఎంఎస్ఎంఈల సహకారం

న్యూఢిల్లీ, డిసెంబర్ 6:భారత ఆర్థిక వ్యవస్థకు సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) రంగం కీలకమైనది. కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు శాఖకు చెందిన కేంద్ర గణాంకాల కార్యాలయం అందిన సమాచారం ప్రకారం 2018–19 మరియు 2019–20 సంవత్సరాల్లో అఖిల భారత తయారీ స్థూల విలువ ఉత్పత్తిలో ఎంఎస్ఎంఈ రంగం తయారీ వాటా వరుసగా 36.9% మరియు 36.9%గా ఉందని తెలిపింది. డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ కమర్షియల్ ఇంటెలిజెన్స్ అండ్ స్టాటిస్టిక్స్ సంస్థ నుండి అందిన సమాచారం ప్రకారం 2019–20–2020–21 సంవత్సరాలలో ఆల్ ఇండియా ఎగుమతులకు పేర్కొన్న ఎంఎస్ఎంఈ రంగా ఉత్పత్తుల ఎగుమతి వాటా వరుసగా 49.8% మరియు 49.4%గా ఉంది. ఈ విషయాన్ని కేంద్ర ఎంఎస్ఎంఈ శాఖ మంత్రి శ్రీ నారాయణ్ రాణే ఈరోజు రాజ్యసభకు ఇచ్చిన ఒక లిఖితపూర్వక సమాధానంలో తెలియజేశారు.

## సీడీపీలకు నిధుల కేటాయింపు

న్యూఢిల్లీ, డిసెంబర్ 6:సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) మంత్రిత్వ శాఖకు చెందిన సూక్ష్మ మరియు చిన్నిపరిశ్రమల క్లస్టర్ డెవలప్‌మెంట్ కార్యక్రమానికి (ఎంఎస్ఈ–సీడీపీ) నిధుల కేటాయింపుపై ప్రభుత్వం వివరాలను తెలిపింది. ఇండస్ట్రియల్ ఎస్టేట్, మెట్టుపాళం, పుదుచ్చేరిలో మౌలిక సదుపాయాల ఆధునికీకరణకు ఈ ప్రాజెక్టు కింద రూ 4.14 కోట్ల గ్రాంట్‌కు సమ్మతిని ఇచ్చింది. ఇందులో రూ. 1.59 కోట్ల నిధులను విడుదల చేసింది. దీనికి తోడు ఎంఎస్ఎంఈ మంత్రిత్వ శాఖకు చెందిన టెక్నాలజీ సెంటర్ సిస్టమ్స్ ప్రోగ్రామ్ (టీసీఎస్‌పీ) కింద పుదుచ్చేరిలో రూ.121.00 కోట్ల వ్యయంతో కాలాపేట్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ పార్క్‌లో ఒక సాంకేతిక కేంద్రం (టీసీ) ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనకు కూడా అనుమతినిచింది. ఎంఎస్ఎంఈ మంత్రిత్వ శాఖ యొక్క మైక్రో అండ్ స్మాల్ ఎంటర్‌ప్రైజెస్ క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (ఎంఎస్ఈ –సీడీపీ) కింద ఆయా పరిశ్రమల మౌలిక సదుపాయాల అభివృద్ధికి 2021–22 ఆర్థిక సంవత్సరానికి రూ.156.50 కోట్ల నిధులు/బడ్జెట్ అంచనాలు కేటాయించిచడమైంది. ఈ విషయాన్ని కేంద్ర ఎంఎస్ఎంఈ శాఖ మంత్రి శ్రీ నారాయణ్ రాణే ఈ రోజు రాజ్యసభకు ఇచ్చిన ఒక లిఖితపూర్వక సమాధానంలో ఈ విషయం తెలియజేశారు.

## సమర్థంగా అమలవుతున్న ఉజ్వాల యోజన

న్యూఢిల్లీ, డిసెంబర్ 6:ప్రధాన మంత్రి ఉజ్వల యోజన (పీఎంయువై) కింద విడుదల చేసిన ఎల్పీజీ కనెక్షన్ల సంఖ్యను పెట్రోలియం మరియు సహజవాయువు శాఖ సహాయ మంత్రి శ్రీ రామేశ్వర్ తెలీ ఈరోజు రాజ్యసభలో ఒక ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానంలో తెలిపారు. రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల వారీగా వివరాలను వెల్లడించారు. 2020–21 మరియు 2021–22 (ఏప్రిల్–అక్టోబర్, 2021) మధ్య విడుదల చేసిన కనెక్షన్ల వివరాలు అనుబంధం–ఎలో ఉన్నాయి

ఉజ్వల లబ్ధిదారులు 2020 ఏప్రిల్ 1 నుంచి తీసుకున్న రీఫిల్ వివరాలు రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల వారీగా అనుబంధం –ఎలో వున్నాయి.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో (ఏప్రిల్–అక్టోబర్, 2021), ఖఓజజ–ఎ కింద ఎల్పీజీ కనెక్షన్లు పొందిన 84% పీఎంయువై లబ్ధిదారులు రీఫిల్ తీసుకున్నారు. 2019–20 ఆర్థిక సంవత్సరంలో పీఎంయువై లబ్ధిదారుల సగటు వినియోగం 3 రీఫిల్ (14.2 కిలోలు) గా ఉంది. 2020–21 ఆర్థిక సంవత్సరంలో సగటు వినియోగం 4.39 రీఫిల్‌కు పెరిగింది.

పీఎంయువై లబ్ధిదారులు ఎల్పీజీని ఎక్కువగా వినియోగించేలా చూడడానికి ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంది. ఇందులో సబ్సిడీ మొత్తాన్ని రుణ మొత్తం నుంచి మినహాయించడం ఒకసారి ఎక్కువ నగదు చెల్లించకుండా చూసేందుకు 14.2 కిలోల సిలిండర్ ను 5 కిలోల సిలిండర్ కు మార్చుకోవడం, 5 కిలోల బరువు ఉండే రెండు సిలిండర్ల కనెక్షన్ కలిగి ఉండడం , ప్రధాన మంత్రి పంచాయతీ నిర్వహించి క్రమం తప్పకుండా ఎల్పీజీ వినియోగించేలా లబ్ధిదారులను ఒప్పించడం, అవగాహనా శిబిరాలను నిర్వహించడం, 2020 ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకు ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ యోజన కింద పీఎంయువై లబ్ధిదారులకు 3 వరకు ఉచిత రీఫిల్‌లు ఇవ్వడం లాంటి చర్యలను ప్రభుత్వం అమలు చేసింది.

## భౌగోళిక ప్రాంతాలలో ఉన్న దేశాల నుంచి ముడి చమురును సేకరిస్తున్న ప్రభుత్వ రంగ చమురు సంస్థలు

న్యూఢిల్లీ, డిసెంబర్ 6:ఏక ప్రాంతంపై ముడి చమురు కోసం ఆధారపడే రిస్కను తగ్గించేందుకు, చమురు ప్రభుత్వ రంగ సంస్థలు (పిఎస్‌యులు) వివిధ భౌగోళిక ప్రాంతాలు, అంటే మధ్య ప్రాచ్యం, ఆఫ్రికా, ఉత్తర అమెరికా, దక్షిణ అమెరికా తదితర దేశాల నుంచి ముడి చమురును సేకరించేందుకు తమ పెట్రోలియం బాస్కెట్‌ను వైవిధ్యపరిచిందని రాజ్యసభలో సోమవారం అడిగిన ఒక ప్రశ్నకు పెట్రోలియం, సహజవాయువుల మంత్రిత్వ శాఖ సహాయమంత్రి రామేశ్వర్ తెలి లిఖితపూర్వకంగా ఇచ్చిన సమాధానంలో వెల్లడించారు. చమురు ప్రభుత్వ రంగ సంస్థలు యుఎస్ఎ, రష్యా, కెనెడా, ఆస్ట్రేలియా, బ్రెజిల్, గుయానా, నార్వే, ఈజిప్ట్, గాబన్, ఘానా, కాంగో, ఈక్వెటోరియల్ గునియా, లిబ్యా, నైజీరియాల నుంచి ముడి చమురును దిగుమతి చేసుకోవడం ప్రారంభించాయి. ముడిచమురు రవాణా దిగుమతిపై చార్జీలు మారుతూ ఉంటాయి. ఈ రవాణా చార్జీలు సప్లై– డిమాండ్ చలనాలపై, కాలానుగుణ మార్పులు, భౌగోళిక రాజకీయ పరిస్థితులు, బంగీ పరిమాణం, దించే పోర్ట్ ప్రదేశం తదితరాలపై ఆధారపడి ఉంటాయి.

## సిజిడి నెట్‌వర్క్‌ల అభివృద్ధి కోసం 407 జిల్లాలను ఆవరిస్తూ 232 భౌగోళిక ప్రాంతాలకు అధికారం

న్యూఢిల్లీ, డిసెంబర్ 6:సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ (సిజిడి) నెట్‌వర్క్ అభివృద్ధిలో భాగంగా సిఎన్‌జి స్టేసన్ల ఏర్పాటు, పిఎన్‌జి కనెక్షన్లు అందించడం అన్నది పెట్రోలియం, సహజవాయువుల నియంత్రణ బోర్డు (పిఎన్‌జిఆర్‌బి) ద్వారా అధికారం పొందిన సంస్థలు నిర్వహిస్తున్నాయని సోమవారం రాజ్యసభలో అడిగిన ఒక ప్రశ్నకు లిఖితపూర్వకంగా ఇచ్చిన సమాధానంలో పెట్రోలియం, సహజవాయువుల మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి రామేశ్వర్ తెలి వెల్లడించారు. సిజిడి నెట్‌వర్క్‌ల అభివృద్ధి కోసం నేటి వరకూ, 27 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల వ్యాప్తంగా ఉన్న 407 జిల్లాలను ఆవరివిస్తూ 232 భౌగోళిక ప్రాంతాలకు అధికారం ఇవ్వడం జరిగింది.

నేటి వరకూ ఉత్తర్ ప్రదేశ్‌లో 34,80,043 పైప్డ్ నేచురల్ గ్యాస్ (పిఎన్‌జి) కనెక్షన్లు, 795 సిఎన్‌జి స్టేషన్లు ఉన్నాయి. దేశంలో గ్యాస్ విస్తరణను పెంచేందుకు అదనంగా పిఎన్‌జిఆర్‌బి 17.09.2021న 11వ సిజిడి బిడ్డింగ్ రౌండ్‌ను ప్రారంభించిందని, ఇందులో 28 జిల్లాల వ్యాప్తంగా 20 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతలను ప్రస్తావిస్తూ 4 భౌగోళిక ప్రాంతాలను సిజిడి నెట్‌వర్క్ అభివృద్ధిలో జోడించడం జరిగిందని ఆయన వివరించారు. ఇందులో ఉత్తర ప్రదేశ్‌లోని 4 భౌగోళిక ప్రాంతాలలోని 7 జిల్లాలు (దియోరియా, అమ్రోహా, సంభల్ (ఇప్పటికే అధికారమిచ్చిన ప్రాంతం మినహా), కాశ్‌గంజ్, బందా చిత్రకూట్, మహోబా కూడా ఉన్నాయి.

# మైక్రో ఇండస్ట్రీస్‌లో 'మేక్ ఇన్ ఇండియా'

న్యూఢిల్లీ, డిసెంబర్ 6:ఎంఎస్ఎంఈ రంగంలో 'మేక్ ఇన్ ఇండియా'కు ఊతమిచ్చేందుకు ఎంఎస్ఎంఈ మంత్రిత్వ శాఖ ఈ క్రింది పథకాలను అమలు చేస్తోంది. ఈ పథకాలు సూక్ష్మ మరియు చిన్న తరహా పరిశ్రమలు మరియు సాంప్రదాయ చేతివృత్తుల వారికి సాధికారత కల్పించడం ద్వారా దేశంలో స్థానికంగా ఉత్పత్తి చేయబడిన వస్తువులను ప్రోత్సహించడంపై దృష్టి సారిస్తాయి:

ప్రధానమంత్రి ఉపాధి కల్పన కార్యక్రమం (పిఎంఈజిపి) అనేది వ్యవసాయేతర రంగంలో సూక్ష్మ పరిశ్రమల స్థాపన ద్వారా స్వయం ఉపాధి అవకాశాలను సృష్టించేందుకు ఉద్దేశించిన ప్రధాన క్రెడిట్–లింక్డ్ సబ్సిడీ కార్యక్రమం.

దేశీయ వినియోగం మరియు ఎగుమతుల కోసం స్థానిక ప్రతిభ, ముడి పదార్థాలు మరియు యంత్రాలను ఉపయోగించి వస్తువులను ఉత్పత్తి చేయడంపై ఈ పథకం దృష్టి పెడుతుంది.

సాంప్రదాయ పరిశ్రమల పునరుత్పత్తి కోసం నిధి పథకం (స్ఫూర్తి) సంప్రదాయ పరిశ్రమలు మరియు చేతివృత్తుల వారి ఉత్పత్తులను పోటీతత్వం చేయడానికి మరియు చేతివృత్తులవారికి స్థిరమైన ఉపాధిని అందించడానికి సమూహాలుగా నిర్వహించడానికి దోహదపడుతుంది.

మైక్రో అండ్ స్మాల్ ఎంటర్‌ప్రైజెస్–క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (ఎంఎస్ఈ–సిడిపి) ఒకే విధమైన విలువ గొలుసు కలిగిన 20 లేదా అంతకంటే ఎక్కువ పరిశ్రమలను క్లస్టర్‌లుగా నిర్వహించడం ద్వారా సాధారణ సౌకర్యాల కేంద్రాలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి మరియు ఫ్లాట్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌లను రూపొందించడానికి ఉపయోగపడుతుంది.

హనీ మిషన్ మరియు కుంభార్ శక్తికరణ్ ప్రోగ్రామ్ (కెఎస్‌పి) వంటి భాగాలను కలిగి ఉన్న గ్రామోద్యోగ్ వికాస్ యోజన (జివివై) తేనెటీగల పెంపకందారులను మరియు గ్రామీణ కుమ్మరులకు తేనెటీగల పెట్టెలు, విద్యుత్ చక్రాలు, టూల్‌కిట్‌లు, శిక్షణ మొదలైన వాటిని అందించడం ద్వారా వారిని ప్రోత్సహిస్తుంది. ఈ పథకం స్థానిక సాంప్రదాయ పరిజ్ఞానం ఉపయోగించి నాణ్యమైన ఉత్పత్తుల ఉత్పత్తిని ప్రోత్సహిస్తుంది .

ఖాదీ వికాస్ యోజన: ఖాదీ సంస్థలకు మార్కెటింగ్ సహాయం, వడ్డీ రాయితీ, మౌలిక సదుపాయాల మద్దతు, సామర్థ్యం పెంపుదల, విక్రయ కేంద్రాల ఆధునీకరణ మొదలైన వాటి ద్వారా దేశంలో ఖాదీ అభివృద్ధికి మరియు ఉపాధి అవకాశాల కల్పనకు సహాయం అందిస్తుంది.

అంతేకాకుండా, 'వోకల్ ఫర్ లోకల్'ని ప్రోత్సహించడానికి ఖాదీ మరియు విలేజ్ ఇండస్ట్రీస్ కమిషన్ (కెవిఐసీ) స్థానిక ముడిసరుకు మరియు పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఖాదీ ప్రాకృతిక పెయింట్‌ను తయారు చేయడం ప్రారంభించింది.

ఇది స్థానికంగా ఉత్పత్తి చేయబడిన వస్తువుల మార్కెటింగ్ కోసం కొత్త ఇ–కామర్స్ ప్లాట్‌ఫారమ్ www.ekhadiindia.com కూడా ప్రారంభించింది.

పై పథకాల ప్రభావ అంచనా కోసం థర్డ్ పార్టీ మూల్యాంకనం ఎప్పటికప్పుడు జరుగుతుంది. మూల్యాంకన నివేదిక యొక్క ముఖ్య ఫలితాలు ఈ పథకాలు (తి) ప్రతి సంవత్సరం 5 లక్షల మందికి పైగా ప్రజలకు, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతంలో స్థిరమైన ఉపాధిని అందించగలవని సూచిస్తున్నాయి,

(తితి) సూక్ష్మ మరియు చిన్న పరిశ్రమలలో క్లస్టర్ ప్రోగ్రామ్ ద్వారా ఉత్పత్తి సామర్థ్యం, ఆదాయం మరియు ఉపాధిని పెంచుతాయి (తితితి) సమిష్టి ఏర్పాటు ద్వారా సాంప్రదాయ పరిశ్రమలలో గ్రామీణ మరియు పేద కళాకారులకు సహాయం అందించడం.

మంత్రిత్వ శాఖ ఎంఎస్ఎంఈల సామర్థ్యాన్ని పెంపొందించడానికి వారి ఉత్పత్తుల కోసం కొత్త మార్కెట్లను స్వాధీనం చేసుకోవడానికి మరియు తయారీ సామర్థ్యాన్ని మెరుగుపరచడానికి కొత్త సాంకేతికతలను అన్వేషించడానికి అంతర్జాతీయ సహకార

## భూగర్భడ్రైనేజీ ఔట్ లెట్ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్న ఎమ్మెల్యే కేపీ

కుత్బుల్లాపూర్ ,డిసెంబర్ 6: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, నిజాంపేట్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని 2వ డివిజన్ సాయికృష్ణ కాలనీలో భూగర్భ డ్రైనేజీ ఔట్ లెట్ సమస్యపై ఈరోజు ఎమ్మెల్యే కేపి వివేకానంద్ విచ్చేసి స్థానిక కార్పొరేటర్ చిట్ల దివాకర్ తో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా డ్రైనేజీ ఔట్ లెట్ సమస్యను స్థానిక ప్రజలతో కలిసి పరిశీలించారు. అనంతరం సమస్య శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక డిప్యూటీ మేయర్ దన్ రాజ్ యాదవ్, కార్పొరేటర్లు కాసాని సుధాకర్, సురేష్ రెడ్డి, నిజాంపేట్ అధ్యక్షుడు రంగరాయ ప్రసాద్, సీనియర్ నాయకులు కొలన్ గోపాల్ రెడ్డి, నిజాంపేట్ ప్రధాన కార్యదర్శి నాగరాజ్ యాదవ్, డివిజన్ అధ్యక్షుడు చందు, ఉపాధ్యక్షులు రాములు నాయక్, ఆర్గనైజింగ్ సెక్రటరీ సాంబశివ రెడ్డి, కాలనీ అధ్యక్షులు సురేష్, ఉపాధ్యక్షులు తిరుపతి రెడ్డి, సెక్రటరీ ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.



## సూరారంలో అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే

కుత్బుల్లాపూర్ ,డిసెంబర్ 6:కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, సూరారం 129 డివిజన్ పరిధిలోని అంబేద్కర్ భవన్ వద్ద భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్ధంతిని పురస్కరించుకుని ఈరోజు ఎమ్మెల్యే కేపి వివేకానంద్ ముఖ్య అతిథిగా పాల్గొని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, డివిజన్ ప్రధాన కార్యదర్శి సిద్ధిక్, నాయకులు మంత్రి అరుణ్, రవీందర్ ముదిరాజ్, పందిరి యాదగిరి, దళిత సంఘాల ఐక్య వేదిక చైర్మన్ మద్దెల సత్యనారాయణ, జనరల్ సెక్రెటరీ అశోక్,



కోశాధికారి సాయి బాబా, చీఫ్ అడ్వైజర్ కిషన్ రావు, గౌరవ అధ్యక్షుడు బుచ్చన్న, వైస్ చైర్మన్ శ్యామ్, హోల్యదాసరి నర్సింహా, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎల్లయ్య, శ్రీనివాస్, సాయిబాబా, మహిళా నాయకురాలు అనిత, యాదమ్మ, సత్యనారాయణ, కిరణ్ కుమార్, లక్ష్మణ్, శ్రీనివాస్, సాయి, ప్రకాష్, సంతోష్, జాన్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

## కాటారంలో భారీగా గుట్కా ప్యాకెట్ల పట్టివేత

జయశంకర్ భూపాలపల్లి, డిసెంబర్ 6:: జిల్లాలో కాటారం మండల కేంద్రంలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు సుమారు రెండు లక్షల విలువ చేసే గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు.

టాస్క్‌ఫోర్స్ సీఐ మోహన్ ఆధ్వర్యంలో సోమవారం పలు దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహిం చారు. ఈ తనిఖీల్లో మండల కేంద్రంలోని చింతకాని క్రాస్ వద్ద సోమేశ్వర కిరాణంలో పెద్ద ఎత్తున గుట్కాలు పట్టుబడ్డాయి.

గుట్కాలను స్వాధీనం చేసుకొని నిందితులు అల్లాడి ప్రవీణ్ కుమార్, రాచర్ల సత్యంపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఈ దాడుల్లో టాస్క్‌ఫోర్స్ ఏఎస్ఐ అమరేందర్ రెడ్డి, పీసీ రాజు, తదితరులు ఉన్నారు.

## అంబేద్కర్‌కు నివాళులు అర్పించిన స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి

నిజామాబాద్, డిసెంబర్ 6: గత మూడు వారాల క్రితం కరోనా వైరస్ సోకి హోం క్వారంటైన్ లో ఉన్న శాసనసభాపతి పోచారం శ్రీనివాస్ రెడ్డి పూర్తిగా కోలుకున్నారు. కాగా, సోమవారం భారతరత్న డా. బీఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా హైదరాబాద్‌లోని తన అధికారిక నివాసంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

దేశాభివృద్ధిలో అంబేద్కర్ ఎంతో పాత్ర ఎంతో కీలకమన్నారు. అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా సీఎం కేసీఆర్ పరిపాలన కొనసాగుతుందన్నారు.



## ఢిల్లీలో సోదాలు నిర్వహించిన ఆదాయం పన్ను శాఖ

న్యూఢిల్లీ, డిసెంబర్ 6:తక్కువ పన్ను ఉన్న విదేశాలలో ప్రయోజనం పొందడానికి ఒక ట్రస్టును, ఒక కంపెనీని సృష్టించి కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఒక పన్ను చెల్లింపు దారుడి నివాసం, కార్యాలయంపై ఆదాయం పన్ను శాఖ అధికారులు 24.11.2021 న దాడి చేసి సోదాలు నిర్వహించారు. రెండు ప్రాంతాలపై అధికారులు ఒకేసారి దాడి చేసి సోదాలు చేపట్టారు.

మనుగడలో లేని సంస్థ పేరిట 40 కోట్ల రూపాయల విలువ చేసే స్థిర, చర ఆస్తులు ఉన్నట్లు అధికారులు గుర్తించారు.

దేశంలో శాఖలు కలిగి ఉన్న ఒక విదేశీ బ్యాంకు సేవలను ఈ వ్యక్తి వినియోగించుకున్నట్లు అధికారులు గుర్తించారు. సంపద నిర్వహణ, ఆర్థిక ప్రణాళిక, ఆస్తుల కేటాయింపు, పెట్టుబడుల అధ్యయనం, స్థిర ఆదాయం, పెట్టుబడి వ్యూహాలు లాంటి సేవలను బ్యాంకు ద్వారా సదరు పన్ను చెల్లింపుదారుడు పొందుతున్నట్టు అధికారులు గుర్తించారు.

విదేశీ ఆస్తులను తన పేరు మీద కలిగివున్నట్టు రుజువు చేసే ఆధారాలను అధికారులు ఈ–మెయిల్, ఇతర పత్రాల రూపంలో గుర్తించారు. విదేశీ ఆస్తులను కలిగివున్నట్టు ఆ వ్యక్తి అధికారుల విచారణలో అంగీకరించాడు. కార్యాలయంలో ఖాతాల పుస్తకాల సమాంతర సెట్ రూపంలో డేటాను కలిగి ఉన్న ఒక హార్డ్ డిస్క్‌ను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సేకరించిన ఆధారాలను పరిశీలించిన అధికారులు దేశంలో నిర్వహించిన వ్యాపార లావాదేవీలను 30 కోట్ల రూపాయల మేర తగ్గించి చూపినట్టు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు.

## భారతదేశంలో ప్రజల కు టీకామందు ను ఇప్పించే కార్యక్రమం మరొక ముఖ్యమైన మైలురాయి ని దాటినందుకు సంతోషాన్ని వ్యక్తం చేసిన ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, డిసెంబర్ 6:భారతదేశం లో ప్రజల కు టీకామందు ను ఇప్పించే కార్యక్రమం మరొక ముఖ్యమైన మైలురాయి ని దాటినందుకు ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ సంతోషాన్ని వ్యక్తం చేశారు. ప్రస్తుతం భారతదేశం జనాభా లో అర్హత కలిగిన వారిలో 50 శాతానికి పైగా టీకామందు ను ఇప్పించడం పూర్తి అయింది.

ఆరోగ్యం మరియు కుటుంబ సంక్షేమం శాఖ కేంద్ర మంత్రి డాక్టర్ మన్ సుఖ్ మాండవియా ట్వీట్ కు ప్రధాన మంత్రి సమాధానం గా తాను ఒక ట్వీట్ లో ?

"భారతదేశం లో ప్రజల కు టీకామందు ను ఇప్పించే కార్యక్రమం లో మరొక ముఖ్యమైనటువంటి మైలురాయి ని అధిగమించడం జరిగింది. కోవిడ్ –19 కి వ్యతిరేకం గా సాగుతున్న పోరాటాన్ని పటిష్టపరచడం లో ఈ వేగ గతి ని ఇలాగే కొనసాగిస్తూ ముందుకు పోవడం ముఖ్యం.

అవును మరి, ముఖాని కి మాస్క్ ను పెట్టుకోవడం, ఒక వ్యక్తి కి మరొక వ్యక్తి కి నడుమ సురక్షిత దూరాన్ని పాటించడం సహా కోవిడ్ –19 సంబంధి ఇతర ప్రోటోకాల్స్ అన్నింటిని అనుసరిస్తూ ఉండవలసిందే." అని పేర్కొన్నారు.

## ఒడిశా నుండి ఢిల్లీకి గంజాయి.. ముఠా అరెస్ట్..



కాకినాడ, డిసెంబర్ 6:: ఒరిస్సా నుంచి ఢిల్లీకి గంజాయి రవాణా చేస్తున్న ముఠా అరెస్ట్ చేసినట్లు జిల్లా ఎస్పీ ఎం. రవీంద్రనాథ్ బాబు తెలిపారు.

జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పంజాబ్ రాష్ట్రానికి చెందిన సిమన్ సింగ్, లబఖర,రోహిత్ పాంగి ,కృష్ణ ఖేముడు ,పాంగినరసింహరావు లను అరెస్టు చేయడం జరిగిందని, వీరిలో ప్రధాన ముద్దాయిహేరా సింగ్ పరారీలో ఉన్నారన్నారు. 2 టన్నుల గంజాయిని స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. ఒక లారీ, రెండు కార్లను స్వాధీనం చేసుకున్నామన్నారు.

## విద్యార్థులకు అస్వస్థతపై మంత్రి కీలక ఆదేశాలు

అమరావతి, డిసెంబర్ 6:కృష్ణా జిల్లా మచిలీపట్నంలోని మైనారిటీ గురుకుల పాఠశాలలో విద్యార్థుల అస్వస్థతపై విద్యాశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ ఆరా తీసారు.

అధికారులతో మాట్లాడిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. జలుబు, తీవ్ర జ్వరం లక్షణాలతో 14 మంది విద్యార్థులు ప్రభుత్వ ఆస్పత్రిలో చేరిన సంగతి తెలిసిందే. వాతావరణ మార్పులతో వచ్చే వైరల్ జ్వరాలతో అస్వస్థతకు గురైనట్టు అధికారులు మంత్రికి వివరించారు. మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించాలని అధికారులను మంత్రి ఆదిమూలపు సురేష్ ఆదేశించారు. విద్యా, వైద్య శాఖ అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. పశ్చిమ గోదావరి జిల్లాలో విద్యార్థుల అస్వస్థతపై నివేదిక కోరారు. వైద్య సేవల్లో ఎటువంటి నిర్లక్ష్యం లేకుండా చూడాలని ఆదేశాలు జారీ చేశారు.

# భద్రాద్రిలో భక్తుల సందడి



భద్రాద్రి కొత్తగూడెం, డిసెంబర్ 6:: కార్తిక మాసం పూర్తి కావడంతో సోమవారం భద్రాచలంలోని శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఏపీలోని తూర్పు గోదావరి జిల్లా, ఖమ్మం జిల్లాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. తెల్లవారుజాము నుంచే భక్తులు క్యూలైన్లలో దర్శనం కోసం వేచి ఉన్నారు.

ఆర్జితసేవగా సువర్ణపుష్పార్చన, సహస్రనామార్చన, కేశవనామార్చన తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ వర్గాలు తగు ఏర్పాట్లు చేశాయి.

# ఈ నెలలోనే ఉద్యోగుల విభజన

## -త్వరలో మార్గదర్శకాలు విడుదలయ్యే చాన్స్ సీఎస్‌తో ఉద్యోగ సంఘాల జేఏసీ నేతల భేటీ

హైదరాబాద్, డిసెంబర్ 6:కొత్త జిల్లాలు, జోన్ల ప్రకారం ఉద్యోగుల విభజన ప్రకియ ఒకట్రెండు రోజుల్లో ప్రారంభించే అవకాశాలు కనిపిస్తున్నాయి. మొత్తంగా ఈ నెలలోనే ఉద్యోగుల విభజన కొలిక్కి వచ్చే అవకాశాలున్నాయి. మార్గదర్శకాలు సిద్ధం కాగా, అతి త్వరలోనే వెలువడనున్నాయి. ఉద్యోగుల కేటాయింపులో భాగంగా మొదట అన్నిశాఖల్లోని వారికి ఆప్షన్లు ఇస్తారు. ఉద్యోగులు ఎంచుకొన్న ఆప్షన్ల ప్రకారమే బదిలీలు చేయనుండగా, సీనియార్టీని పరిగణనలోకి తీసుకొంటారు. ఆరోగ్యం, భార్యాభర్తలు వంటి ప్రత్యేక పరిస్థితులను స్పెషల్ క్యాటగిరీగా తీసుకొని బదిలీ చేయనున్నట్టు తెలుస్తున్నది. ఉద్యోగుల వర్గీకరణ, బదిలీల విధివిధానాలపై ఆదివారం సచివాలయంలో సీఎస్ సోమేశ్‌కుమార్, జీఏడీ ముఖ్య కార్యదర్శి వికాస్‌రాజ్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్లశాఖ కమిషనర్ అండ్ ఐజీ శేషాద్రి, ఆర్థికశాఖ ప్రత్యేక కార్యదర్శి రొనాల్డ్ రోస్‌తో టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు మామిళ్ల రాజేందర్, ప్రధాన కార్యదర్శి రాయికంటి ప్రతాప్, టీజీవో రాష్ట్ర అధ్యక్షురాలు మమత, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, నాయకులు సహదేవ్, ముజీబ్ హుస్సేనీ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కొత్త జోన్లు, జిల్లాల ప్రకారం ఉద్యోగుల విభజన మార్గదర్శకాలపై వారు సీఎస్‌తో చర్చించారు.

**ముందుగా ఎన్నికల కోడ్ లేని జిల్లాల్లో..**

కొన్ని జిల్లాల్లో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున, కోడ్ అమల్లో లేని జిల్లాల్లో ముందుగా ఉద్యోగుల విభజన, కేటాయింపు ప్రక్రియను చేపట్టనున్నారు. అయితే క్యాడర్‌ల వారీగా ఉద్యోగులకు ఆప్షన్స్ ఇస్తామని సీఎస్ సోమేశ్‌కుమార్ ఉద్యోగ సంఘాలకు హామీనిచ్చారు. ప్రక్రియ సజావు సాగేందుకు టీజీవో, టీఎన్జీవో, ప్రభుత్వ గుర్తింపు పొందిన జిల్లా స్థాయి ఉద్యోగ సంఘాలను కేటాయింపు సమయంలో ఆహ్వానిస్తామని పేర్కొన్నారు.

**నష్టం జరుగకుండా విభజన**

ఉద్యోగులకు నష్టం జరుగకుండా విభజన చేపట్టాలని సీఎస్‌ను కోరాం. విభజనపై మా నుంచి సూచనలు, సలహాలు తీసుకొన్నారు. సీనియార్టీ నష్టపోకుండా ఉద్యోగులను విభజించాలని, ఏ జిల్లా ఉద్యోగులకు ఆయా జిల్లాకే కేటాయించాలని కోరాం. ఉద్యోగులెవరూ అధైర్యపడొద్దు. ఎవరికీ అన్యాయం జరుగదు.

# జగన్ వ్యక్తిగత హాజరుపై తీర్పు రిజర్వ్

అమరావతి, డిసెంబర్ 6:అక్రమాస్తుల కేసులో ఏపీ సీఎం వైఎస్ జగన్ వ్యక్తిగత హాజరు మినహాయింపు పిటిషన్ పై తీర్పును తెలంగాణ హైకోర్టు రిజర్వ్ లో ఉంచింది. ఈ పిటిషన్ పై హైకోర్టులో నేటితో వాదనలు ముగిశాయి. ఈ పిటిషన్ పై సీబీఐ తరపున సీనియర్ న్యాయవాది సురేంద్ర వాదనలు వినిపించారు. అక్రమాస్తుల కేసులో జగన్ కు హాజరు మినహాయిపు ఇవ్వొద్దని హై కోర్టుకు సీబీఐ విన్నవించారు. గతంలో జగన్ ఇదే అభ్యర్థన చేస్తే సీబీఐ కోర్టు, హైకోర్టు నిరాకరించాయని గుర్తు చేశారు. వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు ఇస్తే సాక్ష్యాలు తారుమారు చేసే అవకాశం ఉందని చెప్పారు. ఈ కారణంగానే గతంలో ఆయనకు వ్యక్తిగత హాజరు మినహాయింపు నిరాకరించినట్టు పేర్కొన్నారు.

ప్రస్తుతం జగన్ హోదా మరింత పెరిగిందని, ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్నందున సాక్షులను మరింత ప్రభావితం చేసే అవకాశం ఉందని సీబీఐ తరుపు న్యాయవాది వాదించారు. పదేళ్లయినా కేసులు డిశ్చార్జి పిటిషన్ల దశలోనే ఉన్నాయని, హాజరు మినహాయింపు ఇస్తే విచారణ మరింత జాప్యం అవుతుందని అభిప్రాయపడ్డారు. ఈ పిటిషన్ పై పూర్తిస్థాయిలో వాదనలు విన్న న్యాయస్థానం.. తీర్పును రిజర్వ్ లో ఉంచుతున్నట్టు ప్రకటించింది.

# ఆదాయం వచ్చే పంటలు పండించండి : సీఎం జగన్

అమరావతి, డిసెంబర్ 6:: రైతులు ఆదాయం వచ్చే పంటలు పండించడం అలవాటు చేసుకోవాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచించారు. వరికి బదులు మిల్లెట్స్ పండించడం ద్వారా ఎక్కువ ఆదాయం పొందవచ్చునని రైతులకు సలహా ఇచ్చారు. మిల్లెట్స్ పండించే వారి కోసం మిల్లెట్స్ బోర్డు ఏర్పాటుచేస్తామని, మిల్లెట్లు ఎక్కువగా పండించే ప్రాంతాల్లో ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటుచేయాలన్నారు. ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు అవగాహన కల్పించాలని, ఇతర పంటలు సాగు చేసేవారికి తగిన తోడ్పాటు అందించాలని అధికారులను ఆదేశించారు. సేంద్రీయ, ప్రకృతిసేద్యంపై రైతుల్లో అవగాహన పెంచాలని చెప్పారు. సోమవారం తాడేపల్లిలోని తన క్యాంప్ కార్యాలయంలో వ్యవసాయ శాఖ, ధాన్యం సేకరణపై సీఎం జగన్ సమీక్ష నిర్వహించారు.

నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు రైతులకు అందించాల్సి ఉద్దేశంతో ఆర్బీకేలను ఏర్పాటు చేశామని, వాటిని నీరుగార్చేలా ఎవరైనా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇలాంటి కేసుల్లో ప్రమేయం ఉండే ఉద్యోగులను ఉద్యోగాల నుంచి తొలగించి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అక్రమాలకు పాల్పడే వ్యాపారులపైనా కఠిన చర్యలు తప్పవన్నారు. దీని కోసం అవసరమైతే చట్టంలో మార్పులు చేసి ఆర్డినెన్స్ తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఇదే సమావేశంలో జగనన్న పాల వెల్లువ కార్యక్రమంపై కూడా జగన్ సమీక్షించారు. డిసెంబర్ నెలలో కృష్ణ, అనంతపురం జిల్లాల్లో పాలవెల్లువ కార్యక్రమాన్ని ప్రారంభించి దీని ద్వారా 1.77 లక్షల మంది మహిళలకు లబ్ధి చేకూర్చుతున్నట్లు అధికారులు తెలిపారు.



# సూర్యప్రభ వాహనంపై వేణుగోపాలుడి అలంకారంలో పద్మావతి అమ్మవారు

తిరుమల, డిసెంబర్ 6:: తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయంలో కార్తీక బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో ఏడో రోజైన సోమవారం సూర్యప్రభ వాహనంపై వేణుగోపాలకృష్ణుడి అలంకారంలో పద్మావతి అమ్మవారు దర్శనమిచ్చారు. ఆలయం వద్దగల వాహన మండపంలో ఉదయం 8 నుంచి 9 గంటల వరకు అమ్మవారి వాహనసేవ ఏకాంతంగా జరిగింది.

సూర్యభగవానుడు ప్రత్యక్ష నారాయణుడు. లక్ష్మీ సమేతుడైన శ్రీమన్నారాయణుడు సూర్యమండలాంతర్గతుడై వెలుగొందుతున్నాడని ఉపనిషత్తులు పేర్కొంటున్నాయి. సూర్యభగవానుని కిరణస్పర్శతో పద్మాలు వికసిస్తాయి. అలాంటి పద్మాలే లక్ష్మికి నివాసస్థానాలు. సూర్యనారాయణుని సాక్షిగా తిరుచానూరులో శ్రీవారు తపమాచరించి కృతార్థులయ్యారు. సూర్యప్రభ వాహనంలో అమ్మవారి దర్శనం ఆరోగ్యం, ఐశ్వర్యం, సత్సంతానం, సుజ్ఞానం మొదలైన ఫలాలను పరిపూర్ణంగా ప్రసాదిస్తుందని భక్తుల విశ్వాసం.

తిరుపతికి చెందిన పొన్నాల సుధాకర్, ఉదయ్ అనే భక్తులు సోమవారం ఉదయం 100 డజన్ల గాజులు, హుండీ బట్టలు విరాళంగా అందించారు. వీటిని జేఈవో వీరబ్రహ్మంకు అందజేశారు. వాహనసేవలో పెద్దజీయర్ స్వామి, చినజీయర్ స్వామి, జేఈవో వీరబ్రహ్మం, ఆలయ డెప్యూటీ ఈవో కస్తూరిబాయి, ఏఈవో ప్రభాకర్ రెడ్డి, పాంచరాత్ర ఆగమసలహాదారు శ్రీనివాసాచార్యులు, అర్చకులు బాబుస్వామి, సూపరింటెండెంట్లు శేషగిరి, మధుసూధన్, ఏవీఎస్వో వెంకటరమణ, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ రాజేష్ కన్నా పాల్గొన్నారు.



# జీవితమే ఓ చదరంగం : మంత్రి ఎర్రబెల్లి

వరంగల్, డిసెంబర్ 6:: జీవితమే ఓ చదరంగం, ఆటల్లో గెలుపు ఓటములు సహజమని పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. పర్వతగిరి మండలం కల్లెడ ఆర్డీఎఫ్ అచ్యుత వనితా పాయి జూనియర్ కాలేజీలో జరుగుతున్న గర్ల్స్ జూనియర్, సీనియర్ చెస్ పోటీలకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.

క్రీడల్లో గెలుపు ఓటములు సహజం. క్రీడా స్ఫూర్తి ని ప్రదర్శించడం ముఖ్యం అన్నారు. రాజకీయం కూడా ఒక చదరంగమే. మీరు అంతా క్రీడా చదరంగంలో ఉన్నారు. మాలాంటి వాళ్లం రాజకీయ చదరంగంలో ఉన్నామని ఉత్సాహపరిచారు. రాజకీయంగా ఎత్తులు వేయడంలో మీ ఎమ్మెల్యే ఆరూరి రమేశ్ మంచి పట్టు సాధించాడు అని చమత్కరించారు.

ఏమైనా, ఎత్తులు, పై ఎత్తుల తో కూడిన ఓ అద్భుత క్రీడ చదరంగం. ఈ ఆట మెదడుకు సంబంధించింది. ఈ ఆటలో రాణించేవాల్లు కచ్చితంగా జీవితంలో కూడా రాణిస్తారని మంత్రి తెలిపారు. మీరంతా మీ జీవితాల్లో బాగా ఎదగాలని ఆకాంక్షించారు.



నిర్వాహకులు ఎర్రబెల్లి రామ్ మోహన్ రావును మంత్రి అభినందించారు. ఇలాంటి కార్యక్రమాలకు మా అండదండలు ఎల్లప్పుడూ ఉంటాయన్నారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే ఆరూరి రమేశ్, పిల్లలతో కలిసి మంత్రి కొద్దిసేపు చెస్ ఆడారు.

# నర్సంపేట దవాఖానకు మహర్దశ

హైదరాబాద్, డిసెంబర్ 6:నర్సంపేట దవాఖానకు మహర్దశ పట్టనుంది. జిల్లాస్థాయి ఆస్పత్రిగా రాష్ట్ర ప్రభుత్వం అప్‌గ్రేడ్ చేసింది. ఈమేరకు పడకల సామర్థ్యాన్ని 50 నుంచి 250కి పెంచింది. దవాఖాన నూతన భవన నిర్మాణానికి రూ.66.48 కోట్లు కేటాయించింది. పట్టణ పరిధిలో దవాఖాన నిర్మాణానికి కావాల్సిన పదెకరాల స్థలాన్ని కేటాయించే పనులను రెవెన్యూ అధికారులు ఇప్పటికే పూర్తిచేశారు. ఇటీవల హైదరాబాద్‌లో ఇదే అంశంపై మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే పెద్ది సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. చేయాల్సిన పనులపై దిశానిర్దేశం చేశారు. దీంతో పనులు చకాచకా సాగుతున్నాయి.

జిల్లాస్థాయి దవాఖాన నర్సంపేట ప్రాంత ప్రజలకు వరంగా మారనుంది. తెలంగాణ ఏర్పడిన తర్వాత కొత్త జిల్లాల ఏర్పాటులో భాగంగా నర్సంపేటకు ఆస్పత్రి మంజూరు చేశారు. గతంలో ఉన్న దవాఖాన రెండు జిల్లాల్లోని మండలాలకు సేవలను అందిస్తోంది. కాగా, రూ.66.48 కోట్ల వ్యయంతో నిర్మాణాలు చేపట్టనున్నారు. పట్టణ పరిధిలో ఆస్పత్రి నిర్మాణానికి కావాల్సిన పదెకరాల స్థలాన్ని కేటాయించేందుకు ఇటీవలే రెవెన్యూ అధికారులు సర్వే చేశారు. ఇటీవల హైదరాబాద్‌లో ఉన్నతాధికారులతో జిల్లా స్థాయి దవాఖానపై వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీష్‌రావు సమీక్ష చేశారు.

జిల్లా ఆస్పత్రి నిర్మాణానికి రూ.66.48 కోట్లు మంజూరు చేశారు. నర్సంపేటలో ఇప్పటివరకు 50 పడకల ఆస్పత్రి అందుబాటులో ఉంది. అయితే జిల్లా స్థాయి ఆస్పత్రి నర్సంపేటకు మంజూరు కావడంతో స్పెషలిస్టు వైద్యులు అందుబాటులోకి రానున్నారు. ఇప్పుడున్న దవాఖానలో కేవలం 15 మంది వైద్యులే సేవలు అందిస్తున్నారు. జిల్లా స్థాయిగా మారడం వల్ల వైద్యుల సంఖ్య 40 నుంచి 50 వరకు ఉండే అవకాశాలు ఉన్నాయి. నర్సంపేట ఏరియా ఆస్పత్రికి ఈ డివిజన్ నుంచే కాకుండా మహబూబాబాద్ జిల్లాలోని కొత్తగూడ, గూడురు, గంగారం మండలాలకు చెందిన ప్రజలు కూడా వస్తున్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని తెలంగాణ ప్రభుత్వం నర్సంపేట ఆస్పత్రిని అప్‌గ్రేడ్ చేయాలని నిర్ణయించింది. జిల్లా స్థాయి ఆస్పత్రి భవన నిర్మాణానికి రూ.56 కోట్లు, వసతుల కల్పనకు రూ.10.48 కోట్లు కేటాయించారు.

**వార్డుల వారీగా సేవలు..**

జిల్లా స్థాయి దవాఖాన ఏర్పాటుతో ప్రజలకు ఎన్నో సేవలు అందుబాటులోకి రానున్నాయి. సర్జికల్‌వార్డు, గైనిక్‌వార్డు, పీడియాట్రిక్ వార్డు, మెడికల్‌వార్డు, ఆప్‌స్ట్రిక్స్, ఆర్థో, ఎమర్జెన్సీ, ఈఎన్‌టీ, ఆఫ్తో, డెర్మటాలజీ విభాగాలు ఏర్పడనున్నాయి. ఒక్కో విభాగానికి సివిల్ సర్జన్, అసిస్టెంట్ సివిల్ సర్జన్లు ఉంటారు. వైద్యులు కూడా అందుబాటులోకి రానున్నారు. దీనివల్ల ప్రజలు వరంగల్, హైదరాబాద్, ఖమ్మం తదతర నగరాలకు వైద్యం కోసం వెళ్లాల్సిన అవసరం ఉండదు. అత్యాధునిక వైద్య పరికరాలు, డయాగ్నసిస్ సేవలు అందుబాటులోకి వస్తాయి.

**పనులు ప్రారంభం..**

నర్సంపేటలో 250 పడకల ఆస్పత్రిని నిర్మిస్తామని ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చారు. దీనిలో భాగంగా ఆస్పత్రి నిర్మాణానికి నిధు లు మంజూరు చేస్తూ నవంబర్ 3న జీవో విడుదల చేశా రు. స్థలం కేటాయింపు ప్రక్రియను పూర్తి చేశారు. ఇటీవలే దామరచెరువు సమీపంలో రెవెన్యూ శాఖకు చెంది న 10 ఎకరాల స్థలాన్ని వైద్య ఆరోగ్యశాఖకు కేటాయించారు. అడ్వాన్స్ పొజిషన్‌ను దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ గోపాల్‌కు అందించారు. స్థలం చుట్టూ హద్దు రాళ్లను పాతే పనులు కూడా పూర్తయ్యాయి.

**ప్రజలకు మెరుగైన వైద్య సేవలు.. నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి**

నర్సంపేట నియోజకవర్గ ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందనున్నాయి. జిల్లా స్థాయి ఆస్పత్రి నిర్మాణం కోసం ముఖ్యమం త్రి కేసీఆర్ నిధులు మం జూరు చేశారు. యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టాలని ఉన్నతాధికారులకు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు ఇటీవల ఆదేశాలు జారీ చేశా రు. ఆస్పత్రికి కావాల్సిన పది ఎకరాల స్థలాన్ని కూ డా కేటాయించాం. ఇకపై మారుమూల పల్లె ప్రజలకు కూడా కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయి. ఆస్పత్రిని మంజూరు చేసినందుకు సీఎంకు కృతజ్ఞతలు.

**స్థలం హద్దులు నిర్ణయించాం.. డాక్టర్ గోపాల్, ఏరియా దవాఖాన సూపరింటెండెంట్**

నర్సంపేటలో 250 పడకల ఆస్పత్రిని నిర్మించేందుకు అవసరమైన స్థలాన్ని రెవెన్యూ శాఖ పొజిషన్ ఇచ్చింది. ఆ స్థలానికి హద్దులను కూడా నిర్ణయించాం. మరింత మెరుగైన వైద్య సేవలు ప్రజలకు అందనున్నాయి. జిల్లా స్థాయి దవాఖానలో ఉండాల్సిన వైద్యులు, పరికరాలు నిబంధనల ప్రకారం వస్తాయి. ఈ ఆస్పత్రి నిర్మాణానికి అవసరమైన నిధులు రూ.66.48 కోట్లు ఇప్పటికే మంజూరు చేశారు. ప్రస్తుతం ఇక్కడ 70 పడకలు అందుబాటులో ఉన్నాయి. కొత్త ఆస్పత్రిలో అన్ని విభాగాలు ఏర్పడుతాయి

# ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన మంత్రి ఎర్రబెల్లి

మహబూబాబాద్, డిసెంబర్ 6:: జిల్లాలోని పెద్ద వంగర మండలం గంట్లకుంట, పోచంపల్లి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొనుగోలు ప్రక్రియను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..రైతులను ఇబ్బంది పెట్టకుండా, వారి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని సంబంధిత అధికా రులను ఆదేశించారు.రైతులు ధాన్యాన్ని బాగా ఎండబెట్టి, తేమ, తాలు లేకుండా జాగ్రత్త పడితే మంచి ధర వస్తుంన్నారు.

ప్రత్యామ్నాయ పంటల పై అవగాహన కల్పించారు. వ్యవసాయ ంలో పంటల మార్పిడి సహజమేనని, అయితే లాభదాయక పంటలు వేసుకోవాలని సూచించారు

. కేంద్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక చట్టాలు తెచ్చి చివరకు ధాన్యం, బియ్యం కొనబోమని మొండి కేసిందని రైతులకు చెప్పారు.

తాను కూడా తన పొలాన్ని చెలకగా మార్చి ఆయిల్ పామ్ వేశానని చెప్పారు. తొర్రూరులో ఆయిల్ పామ్ పరిశ్రమను స్థాపిస్తామన్నారు. రైతులు ఈ యాసంగిలో వరికి బదులు ఇతర పంటలు వేయాలని సూచించారు.



# స్థానికత ఆధారంగానే ఉద్యోగుల విభజన

హైదరాబాద్, డిసెంబర్ 6:రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు తెలంగాణ శుభవార్త వినిపించింది. ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న ఉద్యోగుల విభజన ప్రక్రియకు గ్రీన్ సిగ్నల్ వచ్చింది. స్థానికత ఆధారంగానే ఉద్యోగుల విభజన చేపట్టనున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు సాధారణ పరిపాలన శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ప్రభుత్వ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

స్థానికత ఆధారంగా ఉద్యోగుల విభజనకు రాష్ట్ర ప్రభుత్వం విధివిధానాలను ప్రకటించింది. 2018 రాష్ట్రపతి ఉత్తర్వులకు లోబడి, కొత్త జోనల్ విధానానికి అనుగుణంగా ఉద్యోగుల విభజన చేపట్టనున్నారు. ఈ క్రమంలో ఉద్యోగుల కేటాయింపు కోసం కమిటీలను ఏర్పాటు చేశారు. జిల్లా స్థాయి పోస్టులకు ఉమ్మడి జిల్లా కలెక్టర్ నేతృత్వంలో, జోనల్ పోస్టులకు, మల్టీ జోనల్ పోస్టులకు జీఏడీ ముఖ్యకార్యదర్శి నేతృత్వంలో కమిటీలను ఏర్పాటు చేశారు.

ఎన్నికల కోడ్ లేని జిల్లాల్లో తక్షణమే ప్రక్రియ మొదలుకానుంది. మిగతా జిల్లాల్లో ఎన్నికల కోడ్ అనంతరం చేపట్టనున్నారు. ఉద్యోగుల నుంచి ఐచ్ఛికాలు తీసుకోనుంది. సీనియార్టీ ప్రాతిపదికన ఉద్యోగుల విభజన చేపట్టనున్నారు. ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు కేటాయించిన పోస్టులకు అనుగుణంగా విభజన జరగనుంది. 70 శాతానికి పైగా సమస్యలు ఉన్న దివ్యాంగులకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. పిల్లల్లో మానసిక దివ్యాంగులుంటే ప్రాధాన్యం ఇవ్వనున్నారు. వితంతువులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి కూడా ప్రాధాన్యం ఇవ్వనున్నారు.

# టీఎంసీతో చేతులు కలిపిన ఎంజీపీ!

న్యూఢిల్లీ, డిసెంబర్ 6: కాషాయ పార్టీకి గతంలో భాగస్వామ్య పక్షంగా వ్యవహరించిన మహారాష్ట్రవాది గోమంతక్ పార్టీ (ఎంజీపీ) రానున్న గోవా అసెంబ్లీ ఎన్నికల్లో ఈసారి మమతా బెనర్జీ సారధ్యంలోని తృణమూల్ కాంగ్రెస్‌తో జట్టు కట్టనుంది. తృణమూల్‌తో పొత్తు పెట్టుకుంటామని ఎంజీపీ సోమవారం ప్రకటించింది.

వచ్చే ఏడాది ఆరంభంలో జరిగే గోవా అసెంబ్లీ ఎన్నికల్లో తృణమూల్ కాంగ్రెస్‌తో కలిసి పోటీచేయాలని పార్టీ కే?ంద్ర కమిటీ నిర్ణయించిందని ఎంజీపీ అధ్యక్షుడు దీపక్ ధవళికర్ తెలిపారు. ముఖ్యమంత్రి అభ్యర్థి ఎవరనేది ఆ తర్వాత నిర్ణయిస్తామని పేర్కొంది. గోవా ప్రజలకు మెరుగైన పాలన అందించేందుకే తాము చేతులు కలిపామని ఎంజీపీ అధ్యక్షుడు దీపక్ చెప్పారు. బీజేపీకి వ్యతిరేకంగా ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందని అన్నారు.

కాగా 2019లో ఎంజీపీ బీజేపీ భాగస్వామ్య పక్షంగా వ్యవహరించింది. తాము బీజేపీని పలు సందర్భాల్లో విమర్శలు గుప్పించామని, ఆప్, కాంగ్రెస్, టీఎంసీ వంటి ఇతర పార్టీలతో చర్చలు జరుపుతున్నామని దీపక్ తెలిపారు. మరోవైపు గోవా అసెంబ్లీ ఎన్నికల్లో సత్తా చాటాలని ఆప్ ఎన్నికల వ్యూహాలకు పదునుపెడుతోంది.

# భద్రాద్రిలో ఏపీ మంత్రి కొడాలి నాని పూజలు



భద్రాద్రి కొత్తగూడెం, డిసెంబర్ 6:: భద్రాద్రి రామయ్యను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కొడాలి నాని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. స్వామివారికి 13 లక్షల రూపాయల విలువ గల స్వర్ణ కిరీటాన్ని సమర్పించారు. అర్చకులు ఆయన స్వాగతం పలికి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు, ఏపీ సీఎం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి శ్రీసీతారామచంద్ర స్వామివారి ఆశీస్సులు ఉండాలని కోరుకున్నట్లు ఆయన తెలిపారు.

# కూ యాప్‌తో జతకట్టిన సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఇండియన్ లాంగ్వేజెస్

హైదరాబాద్, డిసెంబర్ 6:సోషల్ మీడియా దుర్వినియోగాన్ని అరికట్టడంతో పాటు భాష ఉపయోగాన్ని ప్రోత్సహించడానికి భారతదేశ బహుళ భాషా మైక్రో బ్లాగింగ్ ప్లాట్‌ఫారం కూ హోల్డింగ్ కంపెనీ బాంబినేట్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్‌తో మైసూర్‌లోని సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ లాంగ్వేజెస్ (అఎఐఎ) అవగాహన ఒప్పందం (ఓఊఐ) కుదుర్చుకుంది. భారతీయ భాషల అభివృద్ధిని సమన్వయం చేయడానికి భారత ప్రభుత్వంచే స్థాపించబడిన అఎఐఎ, యాప్ కంటెంట్ నియంత్రణ విధానాలను బలోపేతం చేయడానికి, అలాగే యూజర్లకు ఆన్‌లైన్‌లో సురక్షితమైన వాతావరణాన్ని అందించడానికి కూ తో కలిసి పని చేయనుంది.

ఈ ఒప్పందం గురించి మరిన్ని ఆసక్తికర విషయాలు తెలుపుతూ కూ యాప్ సహ వ్యవస్థాపకుడు అండ్ సీఈఓ అప్రమేయ రాధాకృష్ణ మాట్లాడుతూ? భారతీయులు బహుళ భాషల్లో సంభాషించడానికి, కనెక్ట్ అవ్వడానికి వీలు కల్పించే ఒక ప్రత్యేకమైన సోషల్ మీడియా ప్లాట్‌ఫారంగా దుర్వినియోగాన్ని అరికట్టి ఆన్‌లైన్ వాతావరణాన్ని మెరుగుపరచడం ద్వారా తమ యూజర్లను మరింత బలోపేతం చేయడానికి తాము ప్రయత్నిస్తున్నామన్నారు. తమ భాషా సంస్కృతులలోని వ్యక్తులతో అర్థవంతంగా సంభాషించడానికి ప్లాట్‌ఫారంను ఉపయోగించాలని తాము యూజర్లను కోరుకుంటున్నామన్నారు. ఈ కార్పస్‌ను నిర్మించడానికి, నెక్టడ్ ప్రపంచాన్ని ఇంటర్నెట్ వినియోగదారులకు మరింత సురక్షితంగా, విశ్వసనీయంగా మార్చడానికి ప్రఖ్యాత సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ లాంగ్వేజెస్‌తో భాగస్వామిగా ఉన్నందుకు తాము సంతోషిస్తున్నామన్నారు. స్థానిక భారతీయ భాషల్లో స్వీయ వ్యక్తీకరణ కోసం ఒక ప్రత్యేక వేదికైన కూ యాప్ ప్రస్తుతం తొమ్మిది భాషల్లో వినూత్న ఫీచర్లు అందిస్తుందన్నారు. త్వరలోనే మొత్తం 22 అధికారిక భారతీయ భాషలను కవర్ చేసే విధంగా అడుగులు వేస్తుందని అన్నారు.

# ఈటల రాజేందర్ భూకబ్జా వాస్తవమే : మెదక్ కలెక్టర్

మెదక్, డిసెంబర్ 6 (నేటినిజం ప్రతినిధి):: మాజీ మంత్రి ఈటల రాజేందర్ భూకబ్జా వాస్తవమేనని మెదక్ జిల్లా కలెక్టర్ హరీశ్ స్పష్టం చేశారు. ఈటల భూముల అంశంపై మెదక్ కలెక్టర్ మీడియాతో మాట్లాడారు. మాసాయిపేట మండలం అచ్చంపేట, హకీంపేట్ పరిధిలో అసైన్డ్ భూములను జమునా హ్యాచరీస్ కబ్జా చేసింది వాస్తవమేనని చెప్పారు. 70.33 ఎకరాల భూమిని కబ్జా చేసినట్లు రెవెన్యూ అధికారుల సర్వేలో తేలిందన్నారు.అచ్చంపేట, హకీంపేట పరిధిలో గల సర్వే నంబర్ 77 నుంచి 82, 130, హకీంపేట్ శివారులో గల సర్వే నంబర్ 97, 111లో సీలింగ్ భూములను కబ్జా చేశారు. సర్వే నంబర్ 78, 81, 130లలో భారీ పౌల్ట్రీ షెడ్స్, ప్లాట్‌ఫామ్‌లు, రోడ్లను అనుమతి లేకుండా నిర్మించారు. సర్వే నంబర్ 81లో 5 ఎకరాలు, 130లో 3 ఎకరాలను అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. మొత్తంగా 56 మంది అసైనీల భూములను కబ్జా చేసినట్లు తేలిందన్నారు.అసైన్డ్ భూములను వ్యవసాయేతర అవసరాలకు వాడుతున్నారు. అనుమతులు లేకుండా పెద్ద పెద్ద షెడ్డులు నిర్మించారు. నిషేధిత జాబితాలోని భూములను రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. వాల్టా చట్టాన్ని ఉల్లంఘించి అటవీ ప్రాంతంలో చెట్లు నరికి, రోడ్డు వేశారు. పౌల్ట్రీ నుంచి కాలుష్యం వెదజల్లుతున్నట్లు గుర్తించామన్నారు. మొత్తానికి అసైన్డ్ భూముల కబ్జా, అక్రమ నిర్మాణాలపై ప్రభుత్వానికి నివేదిక పంపాం. అక్రమాలకు పాల్పడిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హరీశ్ స్పష్టం చేశారు. అక్రమాలకు సహకరించిన అధికారులపై కూడా చర్యలు తీసుకుంటామన్నారు. బాధిత అసైనీలకు న్యాయం చేసేలా ప్రభుత్వానికి నివేదిక పంపామని కలెక్టర్ హరీశ్ పేర్కొన్నారు.

# కివీస్‌పై భారీ విజయం.. ఇండియా నెంబర్ వన్.. టెస్ట్ ర్యాంకింగ్స్‌లో సూపర్




న్యూఢిల్లీ, డిసెంబర్ 6:ఐసీసీ మెన్స్ టెస్ట్ టీమ్ ర్యాంకింగ్స్‌లో టీమిండియా ఫస్ట్ నిలిచింది. న్యూజిలాండ్‌తో జరిగిన సిరీస్‌ను 1–0 తేడాతో కైవసం చేసుకున్న కోహ్లీసేన.. ఐసీసీ ర్యాంకింగ్స్‌లో తొలి స్థానాన్ని సొంతం చేసుకున్నది. తాజా సిరీస్ విక్టరీతో రేటింగ్‌లో ఇండియా 124 పాయింట్లు సాధించగా.. రెండో స్థానంలో 121 పాయింట్లతో న్యూజిలాండ్ ఉంది. నిజానికి ఈమధ్య ముగిసిన వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్‌లోనూ ఈ రెండు జట్లే ఫైనల్లో తలపడిన విషయం తెలిసిందే.

అయితే టెస్ట్ చాంపియన్‌షిప్ ఫైనల్లో ఓడిన ఇండియా.. తాజాగా కివీస్‌తో ముగిసిన టెస్టు సిరీస్‌ను చేజిక్కించుకున్నది. దీంతో మళ్లీ ఇండియా ర్యాంకింగ్ మెరుగైంది. ఆ తర్వాత ర్యాంకుల్లో ఆస్ట్రేలియా (108), ఇంగ్లండ్(107), పాకిస్థాన్(92) జట్లు ఉన్నాయి. ఇక 2021–2023 టెస్ట్ చాంపియన్‌షిప్ పాయింట్ల పట్టికలో ఇండియా 42 పాయింట్లు సాధించింది. ఇండియన్ టీమ్ స్వంత గడ్డపై టెస్ట్ సిరీస్‌ను గెలవడం వరుసగా ఇది 14వ సారి కావడం విశేషం. న్యూజిలాండ్‌తో జరుగుతున్న టెస్ట్ సిరీస్‌లో రెండో టెస్టులో భారత్ భారీ విజయం సొంతం చేసుకుంది. 167 పరుగులకే కివీస్‌ను కుప్పకూల్చింది. మయాంక్ (62) మరోసారి అర్ధశతకంతో మెరవగా, పుజారా (47), గిల్ (47), కోహ్లీ (36) ఆకట్టుకోగా అక్షర్ 41పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. దీంతో తొలి ఇన్నింగ్స్‌తో కలిపి 540పరుగులు భారీ లక్ష్యాన్ని కివీస్‌కు నిర్దేశించింది. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన న్యూజిలాండ్ నాలుగో రోజు ఆట ప్రారంభమైన కొద్ది సేపటికే (ఉదయం 11 గంటలకు) తోక ముడిచింది. భారత బౌలర్ల ధాటికి నాలుగోరోజే కివీస్ కుప్పకూలడంతో మ్యాచ్‌తోపాటు సిరీస్‌ను కోహ్లీసేన కైవసం చేసుకుంది.

## నార్సింగిలో కారు బీభత్సం.. బైక్ పైకి దూసుకెళ్లడంతో భార్యభర్తలు మృతి..

హైదరాబాద్, డిసెంబర్ 6: హైదరాబాద్‌లోని నార్సింగిలో కారు బీభత్సం సృష్టించింది. నార్సింగిలోని ఎంజీఐటీ వద్ద ఓ కారు బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో టీఎస్07ఇజి6395 నెంబర్ గల బైక్ పై వెళ్తున్న దంపతులు ఘటనా స్థలంలోనే చనిపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్ట్ మార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

కారు నడిపిన సంజీవ్ అనే వ్యక్తి మద్యం మత్తులో ఉండడం. స్పీడ్‌గా కారు నడపడంతోనే ఈ ప్రమాదం జరిందని పోలీసులు తెలిపారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సంజీవ్‌కు డ్రంకెన్ డ్రైవ్ టెస్టులో 148ఎంజీ వచ్చినట్టు తెలిపారు. కాగా, సోమవారం తెల్లవారు జామున బంజారాహిల్స్ లో జరిగిన ప్రమాదంలో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. ఈ ప్రమాదానికి కూడా మద్యం మత్తులో డ్రైవింగ్ చేయడమే కారణం.

## అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి



రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 6 (నేటినిజం ప్రతినిధి):భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని వేములవాడ అర్బన్ మండలం చెక్కపెల్లి గ్రామ సర్పంచ్ జైపాల్ రెడ్డి అన్నారు.

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వర్ధంతిని పురస్కరించుకొని వేములవాడ రూరల్ మండలం చెక్కపల్లి గ్రామం అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు వారి త్యాగాలను స్మరించుకున్నారు ఈ ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గారి రాజ్యాంగ వలన ఈ రోజున ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ వర్గాలకు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు ఎడపల్లి మహేష్, ,ఉప సర్పంచ్ తలారి మంజుల సురేష్ ,మూడో వార్డు సభ్యులు తల రవి, ఎంఎస్ఎఫ్ జిల్లా కోఆర్డినేటర్ జిల్లా సుంకాపాక దామోదర్, జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షులు ఎడపల్లి అనిల్ కుమార్, ఎమ్మార్పీఎస్ రూరల్ మండల అధ్యక్షుడు ఎడపల్లి నాగరాజు, బహుజన్ సమాజ్ పార్టీ సీనియర్ నాయకులు కాసరవేణి పుల్లయ్య, ,ఆటో యూనియన్ సంఘం క్యాషియర్ బొమ్మన పద్మనాభం, పద్మశాలి నాయకులు దాసు, మరియు అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు ఎడపల్లి స్వామి ,సింగారపు ప్రశాంత్, కాదాసు అనిల్ ,ఎలగందుల రాము ,ఎడపల్లి గంగరాజు, ఎడపల్లి అరుణ్ , ఎడపెల్లి నర్సయ్య అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు ఎడ్లపల్లి మహేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు . .

# అభివృద్ధి పనుల్లో వేగం పెంచండి : మంత్రి శ్రీనివాస్ గౌడ్



మహబూబ్‌నగర్, డిసెంబర్ 6:: మహబూబ్‌నగర్ పట్టణ రూపురేఖలు మార్చి హైదరాబాద్‌కు దీటుగా తీర్చిదిద్దాలన్న తలంపుతో పట్టణంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలని ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అధికారులను ఆదేశించారు.

పట్టణ అభివృద్ధిపై సోమవారం ఆయన మహబూబ్ నగర్‌లోని తన క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఎస్. వెంకట్రావు, ఎస్పీ ఆర్.వెంకటేశ్వర్లు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, మున్సిపల్ ఆర్ అండ్ బి, పంచాయతీ రాజ్ తదితర అధికారులతో సమీక్షించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..రూ. 3.5 కోట్లలతో ఎంవీఎస్ కళాశాల మైదానంలో నూతన స్టేడియం ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నామన్నారు. ప్రస్తుతం ఉన్న ఫిష్, మీట్ మార్కెట్‌లో 3 కోట్ల రూపాయలతో మరో మార్కెట్ నిర్మించాలని, రూ. 8 కోట్లతో చేపట్టిన స్లాటర్ హౌస్ నిర్మాణ పనులను నెలరోజుల్లో పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని మంత్రి ఆదేశించారు.

రహదారి విస్తరణలో భాగంగా పట్టణంలో చేపట్టిన రహదారి మధ్యలో 10 సంవత్సరాల వయసు కలిగిన పెద్ద పెద్ద మొక్కలను రోడ్డు మధ్యలో నాటేందుకు ప్రణాళిక తయారు చేయాలని ఆదేశించారు. ఆర్ అండ్ బి అతిథి గృహం వద్ద సమీకృత మార్కెట్ నిర్మాణానికి త్వరలోనే పనులు ప్రారంభించేందుకు సమావేశంలో నిర్ణయించినట్లు మంత్రి వెల్లడించారు.

పట్టణంలో గ్యాస్ క్రిమటోరియం ఉన్నప్పటికీ శ్రీనివాస కాలనీ, పద్మావతి కాలనీలకు వెనకవైపు అనుకొని ఉన్న స్థలంలో పూర్తి ఆధునీకరించిన గ్రేవీ యార్డ్ నిర్మాణానికి చర్యలు చేపట్టాలన్నారు.

బైపాస్ రహదారి వెంట లైటింగ్ పనులతోపాటు, ఫుట్ పాత్ పనులు, బూత్పూర్ నుంచి మహబూబ్ నగర్ వరకు తక్షణమే సెంట్రల్ లైటింగ్ పనులు చేపట్టేందుకు నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి పేర్కొన్నారు.

అలాగే హన్వాడ వద్ద 500 ఎకరాలతో చేపట్టిన ఫుడ్ పార్క్ పనులు వేగవంతం, పట్టణంలో నూతనంగా నిర్మించే కాంప్లెక్స్ కారణంగా ట్రాఫిక్ కు ఇబ్బంది ఉండకుండా పార్కింగ్ స్థలం ఏర్పాటు చేయాలన్నారు. ప్రధాన రహదారులపై కూడా ట్రాఫిక్ కు ఇబ్బంది లేకుండా ఇప్పటి నుంచే కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలన్నారు.

ప్రతి గ్రామంలో ఒక స్టేడియం ఏర్పాటుకు నిర్ణయం. చిన్నదర్పల్లి నుంచి ధర్మాపూర్ వరకు చేపట్టే కొత్త బైపాస్ రోడ్డుకు తుది రూపం ఇచ్చి జాతీయ రహదారులు లేదా ఇతర పథకంలో పూర్తికి నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి వివరించారు.

## రాబోయే మహమ్మారి మరింత ప్రమాదకరం.. ఆక్స్‌ఫర్డ్ వ్యాక్సిన్ సృష్టికర్త వార్నింగ్

లండన్, డిసెంబర్ 6:: ప్రస్తుతం ఉన్న కోవిడ్ సంక్షోభం కన్నా.. భవిష్యత్తులో రాబోయే మహమ్మారులు మరింత ప్రాణాంతకంగా ఉంటాయని ఆక్స్‌ఫర్డ్–ఆస్ట్రాజెనికా వ్యాక్సిన్ సృష్టికర్త ప్రొఫెసర్ డేమ్ సారా గిల్బర్ట్ వార్నింగ్ ఇచ్చారు. 44వ రిచర్డ్ డింబుల్బీ లెక్చర్ సదస్సులో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ.. మహమ్మారులను ఎదుర్కొనేందుకు మరింత తీవ్ర స్థాయిలో ఫండింగ్ అవసరమన్నారు. ఇక ప్రస్తుతం కలవరపెడుతున్న ఒమ్రికాన్ వేరియంట్‌పై కూడా ఆమె స్పందించారు. ప్రస్తుతం ఉన్న వ్యాక్సిన్లు.. ఒమిక్రాన్ వేరియంట్‌పై తక్కువ ప్రభావం చూపే అవకాశాలు ఉన్నట్లు ఆమె వెల్లడించారు. ఒమిక్రాన్ గురించి పూర్తిగా తెలిసేవరకు ప్రజలందరూ జాగ్రత్తగా ఉండాలని ఆమె అన్నారు. మన జీవితాలను వైరస్‌లు శాసించడం ఇదే చివరిసారి కాదు అని, వాస్తవం ఏమిటంటే, భవిష్యత్తులో రాబోయే వైరస్‌లు మరింత విధ్వంసకరంగా ఉంటాయన్నారు. చాలా వేగంగా వ్యాపిస్తాయని, భారీగా ప్రాణ నష్టాన్ని మిగులుస్తాయని ఆమె హెచ్చరించారు. వైరస్‌లపై పోరాటంలో ఎంతో ప్రగతి సాధించామని, ఆ జ్ఞనాన్ని వదులుకోవద్దు అని ఆమె అన్నారు. ఒమిక్రాన్‌లో ఉన్న స్పైక్ ప్రోటీన్‌లో జరుగుతున్న మ్యుటేషన్ల వల్ల ఆ వైరస్ చాలా వేగంగా వ్యాప్తి చెందుతున్నట్లు సారా తెలిపారు.

## తిప్పాపురం పాఠశాలల్లో విద్యార్థులకు స్టడీ మెటీరియల్ నోట్ బుక్స్ , పెన్నులు అందజేత




రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 6 (నేటినిజం ప్రతినిధి): వేములవాడ మున్సిపల్ పరిధి 8వ వార్డు తిప్పా పురంలో సోమవారం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల తిప్పపూర్ నందు గ్రామ నివాసి ఎల్ఐసి ఏజెంట్ నాగుల యాదగిరి, బ్రహ్మన్నగారి రమేష్ ,లలిత సూపర్ మార్కెట్ వారి భాగస్వామ్యంతో 10 వ తరగతి విద్యార్థిని విద్యార్థులకు ఆల్ ఇన్ వన్ స్టడీ మెటీరియల్స్, నోట్ బుక్ , పెన్స్ విద్యార్థులకు నాగుల యాదగిరి అందజేశారు ఈ కార్యక్రమంలో నాగుల విష్ణుప్రసాద్, నాగుల నరేందర్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మణ్ సర్ మరియు ఉపాధ్యాయులు శ్రీధర్, మహేష్, రాజేశ్వర్ , ఉపాధ్యాయినిలు హేమలత,నాగరాణీ ,మరియు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు

## ఒమిక్రాన్ వచ్చినంత మాత్రాన భయపడొద్దు .. కేజ్రీవాల్ ..

ఒమిక్రాన్ కేసు వచ్చినంతమాత్రాన భయపడాల్సిన అవసరం లేదని ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ తెలిపారు. ప్రజలందరూ మాస్క్‌ని తప్పని సరిగా ధరించాలని , భౌతిక దూరం పాటించాలని చెప్పారు. అంతర్జాతీయ విమాన సర్వీసులను ఆపేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కేజ్రీవాల్ కోరారు. కాగా ఆఫ్రికా దేశమైన టాంజానియా నుంచి వచ్చిన 37 ఏళ్ల వ్యక్తిలో ఒమిక్రాన్ వేరియంట్ ఉన్నట్టు తేలింది. ఈ నేపథ్యంలో ఢిల్లీ ఆరోగ్య మంత్రి సత్యేంద్ర జైన్ మాట్లాడుతూ.. ఒమిక్రాన్ వైరస్ ప్రభావం ఉన్న దేశాల నుంచి వస్తున్న ప్రయాణికులకు విమానాశ్రయంలో పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటి వరకు 27 మందిని ఆసుపత్రికి తరలించామని వెల్లడించారు. వీరిలో 17 మందికి పాజిటివ్ గా నిర్ధారణ అయిందని? మిగిలిన వారు వారికి కాంటాక్టులోకి వచ్చినవారని అన్నారు. వీరిలో 12 మంది శాంపిల్స్‌ను జీనోమ్ సీక్వెన్సింగ్ కు పంపించామని? వీరిలో ఒకరికి ఒమిక్రాన్ అని తేలిందని వివరించారు. ప్రజలు జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. శానిటైజర్ , మాస్క్ తప్పని సరి అని అన్నారు.

## మహంకాళి అమ్మవారి భక్తులకు మెరుగైన సేవలందించాలి : మంత్రి తలసాని



కరీంనగర్ డిసెంబర్ 6 (నేటినిజం ప్రతినిధి): సికింద్రాబాద్ లోని మహంకాళి అమ్మవారి దర్శనం కోసం ఆలయానికి వచ్చే భక్తులకు మెరుగైన సేవలందించాలని రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమల అభివృద్ధి, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అధికారులను ఆదేశించారు. ఈరోజు మాసాబ్ ట్యాంక్ లోని తన కార్యాలయంలో మహంకాళి అమ్మవారి ఆలయ అభివృద్ధి, భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాల పై సమీక్షించారు. ఈ సమావేశంలో దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్ కుమార్, రీజనల్ జాయింట్ కమిషనర్ రామకృష్ణ, ఆలయ ఈఓ మనోహర్ రెడ్డి, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు మహేష్, కిషోర్, బాలాజీ శ్రీనివాస్ గౌడ్, కస్తూరి, ఆనంద్ పటేల్, చందు, కేఎం కృష్ణ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ? ఎంతో చరిత్ర కలిగిన మహంకాళి అమ్మవారి ఆలయం ప్రభుత్వం, దాతలు, భక్తుల సహకారంతో ఎంతో అభివృద్ధి చెందిందని చెప్పారు. ప్రతి ఏటా నిర్వహించే బోనాల ఉత్సవాలకు లక్షలాది మంది భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుంటారని తెలిపారు. మొక్కుల రూపంలో భక్తులు చెల్లించిన బంగారంతో అమ్మవారికి బంగారు బోనం చేయించిన విషయాన్ని గుర్తుచేశారు. అదేవిధంగా అమ్మవారి గర్భగుడికి మిగిలి ఉన్న వెండి తాపడం పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. బోనాల ఉత్సవాల సందర్భంగా అమ్మవారి ఊరేగింపునకు ఒక రథాన్ని చేయించాలని, అమ్మవారికి బంగారు చీరను చేయించాలని సమావేశంలో నిర్ణయించారు. ఆలయ అభివృద్ధికి ఇంకా చేపట్టాల్సిన పనులు, భక్తులు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా చేయాల్సిన ఏర్పాట్లపై సమావేశంలో చర్చించారు.

## జాతీయస్థాయిలో ప్రతిభ చాటి బహుమతిని గెల్చుకున్న అల్ఫోర్స్ ఇ - టెక్నో స్కూల్ విద్యార్థినిని అభినందించిన జిల్లా కలెక్టర్



కరీంనగర్ డిసెంబర్ 6 (నేటినిజం ప్రతినిధి): విద్యార్థులకు సృజనాత్మకత చాలా అవసరమని మరియు సృజనాత్మకత ద్వారా నూతన ఒరవడిని సృష్టించవచని తద్వారా సమాజంలో ఉత్తమమైన స్థితిలో జీవితాన్ని గడపవచ్చని కరీంనగర్ జిల్లా కలెక్టర్ ఆర్.బి. కర్నన్ అన్నారు సోమవారం జిల్లా కలెక్టర్ కార్యలయంలో ఆల్ఫోర్స్ ఇ – టెక్నో స్కూల్ విద్యార్థిని కుమారి వి.శ్రీహిత రెడ్డిని అభినందించిన సందర్భంగా మాట్లాడారు . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థినిలు బాలురకు దీటుగా ఉత్తమైన స్థితిని సంపాదించుకోవాలని తద్వారా సమాజంలో ముందంజలో ఉండడమేకాకుండా ప్రశంసనీయంగా జీవితాన్ని కొనసాగించవచ్చని చెప్పారు . విద్యార్థులకు ఉజ్వలమైన భవిష్యత్తు ఉన్నదని కాని వారు పలు వ్యసనాలకు బానిసై అమూల్యమైన జీవితాన్ని వృధా చేసుకుంటుంనారని విచారం వ్యక్తం చేసారు . కరీంనగర్ జిల్లా నుండి జాతీయస్థాయి వరకు ఎంపికై అందరి మన్ననలు పొందిన శ్రీహితారెడ్డి జాతీయస్థాయిలో సైతం ఆసమాన ప్రతిభను కనబర్చి జాతీయస్థాయిలో పురస్కారాన్ని మరియు ల్యాప్టాప్ , ప్రశంస పత్రం మరియు మెమెంటో గెల్చుకోవడం చాలా అభినందనీయమైదని అన్నారు . అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో ఉత్తమమైన విద్యయే ధ్యేయంగా , విలువలతో కూడిన విద్యయే పరిరక్షణ లక్ష్యంగా అనేక కార్యాక్రమాలను నిర్వహిస్తున్న డా . వి . నరేందర్ రెడ్డి ని ప్రత్యేకంగా అభినందించారు . జిల్లా విద్యాధికారి సి. హెచ్.వి.ఎస్.జనార్ధన రావు మాట్లాడుతూ విద్యార్థులకు ఉత్తమైన భోదనను అందించాలని మరియు చేపట్టే పలు కార్యాక్రమాలు చాలా సత్ఫలితాలు ఇస్తున్నాయని తెలుపుతూ పాఠశాలలో విద్యవిధానం చాలా మెరుగ్గ ఉండాలని మరియు విద్యార్థులకు కావలిసిన వనరులను కల్పిస్తూ వారిలో ఏకాగ్రతను మరియు శ్రద్ధను పెంపొందించాలని చెప్పారు . కుమారి శ్రీహిత రెడ్డి చేసిన ప్రాజెక్టు చాలా గణనీయమైనదని మరియు గర్వించదగ్గవిధంగా ఉందని చెప్పారు . జాతీయస్థాయిలో పురస్కరం అందుకోవడం వలన తెలంగాణ రాష్ట్ర కీర్తిపతాకం నులుదిక్కులకు వ్యాపించే విధంగా కృషి చేసినందుకు మరియు విద్యార్థినికి అన్ని రకాలుగా సహాకారం అందించిన డా.వి. నరేందర్ రెడ్డి ని ప్రశంసించారు . ఆల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత డా.నరేందర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థినికి ఎప్పటికప్పుడు విషయాలపట్ల అవగాహన కల్పించి ప్రాజెక్టులో పూర్తిగా పట్టుసాధించే విధంగా శిక్షణ అందించామని ఆ శిక్షణ ద్వారానే నేడు మా విద్యార్థిని ఉత్తమైన స్థితిలో ఉన్నదని మరియు జాతీయస్థాయిలో ప్రతిభ చాటినందుకు వారందరు హృదయపూర్వకంగా శుభాకంక్షలు తెలిపి భవిష్యత్తులో మరిన్ని అద్భుత విజయాలను నమోదు చేయలని ఆకాంక్షించారు . మరియు విద్యార్థిని రుపొందించిన నమునాకు పేటెంట్ హక్కు రావడం చాలా గొప్ప విషయమని చెప్పారు . ఈ అభినందన కార్యక్రమంలో జయపాల్ రెడ్డి , జిల్లా సైన్స్ అధికారి , యం.స్వదేశ్ కుమార్ , జిల్లా సైన్స్ సమన్వయకర్త మరియు సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు .

IN THE COURT OF THE M.A.C.T-CUM-XII ADDL CHIEF JUDGE: CITY CIVIL COURT AT SECUNDERABAD
M.V.O.P. NO.26 OF 2020

Between:
**Mr. Shiv Narayan Mandal** .....Petitioner
**And**
**Mr.O.Uppalaiah and another** ..Respondents

To
Mr. Onteddu Uppalaiah, S/o. O.Venkaiah, Age: 46 years
Occ: Owner-cum-Driver of Trolley Auto bearing No.TS 08UE 3003, H.No.Plot No.2 Sai Dharani Colony,Nagaram, Keesara, Hyderabad.
...Respondent No. 1

Whereas the above named Petitioner filed compensation petition against you and The United India Insurance Company Ltd for a sum of Rs.1,00,000/- for the accident caused by your vehicle Trolley Auto bearing No.TS 08UE 3003 on 19-11-2018 at Keesara ps Limites. The above case is posted to **27-12-2021.** You are hereby summon to appear either in person or through pleader with your defence if any at 10.30 A.M. on the above said date before the Hon'ble Court, failing which the suit will be heard and determined expate.

(BY ORDER OF THE HON'BLE COURT)

**C. VENU GOPAL REDDY**
**A.POORNA CHANDRA RAO**
Advocates.
off: 2-4-120/18, Swaroop Nagar
Uppal, Hyderabad
Ph: 9440431541









Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com